# కలెక్టర్ ఆదేశాలకు తూట్లు... మళ్లీ ఇద్దరు వైద్యులకు బదీలీలు

సత్యవేడు, మే 16 ప్రభాతవార్త: జిల్లా కలెక్టర్ ఆదేశాలను వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులు తుంగలోకి తొక్కారు. అయ్యా మహా ప్రభు సత్యవేడు ఆస్పత్రికి వైద్యులు నియమించండి ఉన్న వైద్యులను బదిలీ చేయవద్దని స్థానిక ఎమ్మెల్యే ఆదిమూలంతో పాటు ఆస్పత్రి కమిటీ సభ్యులు గత నెల 28న జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్‌కి వినతిపత్రం ఇచ్చి అభ్యర్థించిన విషయం తెలిసిందే. డిప్టేషన్‌లో రద్దు చేస్తాం... ఇక ఏ డాక్టర్‌ని సత్యవేడు నుంచి వేరే ప్రాంతానికి పంపించే ప్రసక్తే లేదని, ఆ మేరకు ఫోన్‌లో వైద్య విధాన పరిషత్ ఉన్నతాధికారులకు ఆదేశాలు కూడా ఇవ్వడం జరిగింది. అయితే ఇప్పటికే వైద్యుల కొరతతో అరకొర వైద్య సేవలు అందించే సత్యవేడు ఆస్పత్రికి మరొక సమస్య ఎదురైంది. ఇక్కడ పని చేస్తున్న చిల్డ్రన్ స్పెషలిస్టు, ఎముకల డాక్టర్‌ని తిరుపతి రుయాకు డిప్టేషన్‌పై పంపాలని ఆదేశాలు వచ్చాయి. కలెక్టర్‌కి నెత్తినోరు మొత్తుకుని ఆస్పత్రికి వైద్యుల పోస్టులు పూర్తి స్థాయిలో భర్తీ చేయాలని కోరడం, 15 రోజుల్లోపు ఇక్కడ ఉండే ఇద్దరు వైద్యులను రుయాకు పంపాలని ఆదేశాలు రావడం కూడా జరిగిపోయింది.


సత్యవేడు ఆస్పత్రి

**అవి మాకొద్దు... గ్రూపు రాజకీయాలే ముద్దు**

ప్రజా సమస్యలపై దృష్టి పెట్టాల్సిన అధికార పార్టీ నేతలు నాయకులు తగ్గేదే లేదంటూ గ్రూపు రాజకీయాలకు తెర తీసేశారు. ఇంకే ముందు అధికారుల ఇష్టారాజ్యం పేదవాడికి శాపం గ్రూపు రాజకీయాల్లో ఎవరి మాట వినాలోఎవరి మాట తుంగలోకి తొక్కాలో తెలియని పరిస్థితి అధికార యంత్రాంగంలో నెలకొంది. ఇదే అదునుగా కొందరు వాళ్ల చెప్పారు... వీళ్లు చెప్పారు అంటూ కొన్ని పనులకు మామూలు ముక్కు పిండి వసూలు చేయడం ఒక్క సత్యవేడు నియోజకవర్గంలోనే తారా స్థాయికి చేరిందని ప్రభుత్వ రహస్య నిఘా విభాగం చెబుతోంది. కొన్ని కీలకమైన శాఖలు ఉనికిని కోల్పోతున్నాయి. మీ గ్రూపులు మా కొద్దు...అభివృద్ధికి సహకరించండి పేదలకు ప్రభుత్వ వైద్య సేవలు సంతృప్తికరంగా, అదే విధంగా చూడాలని సత్యవేడు నియోజకవర్గ వాసులు కోరుతున్నారు.




# తెలుగు తమ్ముళ్ళలో... నైరాశ్యం!

ప్రభాతవార్త-తిరుపతి:

నాలుగుదశాబ్దాల పైగా సుదీర్ఘచరిత్ర ఉన్న తెలుగుదేశం పార్టీలో కొందరు నేతల వ్యవహార శైలితో ప్రజాబలం ఉన్న కీలక నేతలు నలిగిపోతున్నారు. పార్టీ పనితీరును, అధినాయకత్వం పలకరింపును ఆసరాగా చేసుకుని పార్టీలో చేరిన కొందరు వలసనేతలకు ఉన్న ప్రాతినిధ్యం కూడా పార్టీ జెండా మోసిన, కష్టకాలంలోనూ ప్రాణాలకు త్యజించి పోరాడినా అధికారంలో ఉన్నపుడు తగిన గుర్తింపులేక కరింపాకులా మారడంతో అసహనం, ఆవేదన వెల్లగక్కుతున్నారు. ఉమ్మడి చిత్తూరుజిల్లాలో టిడిపి లోని కొందరు నేతల తీరుతో సీనియర్లు కూడా అసంతృప్తి గళం వినిపిస్తున్నారు. ఇటీవల నామినేటెడ్ పదవుల భర్తీలో పార్టీకి విశ్వాసులుగా ఉన్న సీనియర్‌నేతల్ని పూర్తిగా పక్కనపెట్టేయడం ఇప్పుడు పెద్ద దుమారం రేపుతోంది. గతంలో 1999 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయఢంకా మ్రోగించి ప్రభుత్వం అధికారం లోకి వచ్చినపుడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో చిత్తూరుజిల్లాలో పార్టీ ఎమ్మెల్యేలు, మంత్రులు పార్టీలో కార్యకర్తలకు కూడా సముచితప్రాధాన్యతనిచ్చి ప్రజల సమస్యలు పరిష్కరించేవారు. ఆ తరువాత 2004 ఎన్నికల్లో టిడిపి ఓటమిచవిచూసింది. వరుసగా 2009 ఎన్నికల్లోనూ టిడిపి అధికారం చేజిక్కించుకోలేక పోయింది. ఆ పది సంవత్సరాలు రాష్ట్రంలోనేగాక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో పలువురు నేతలు ప్రజాసేవలోనే ఉన్నారు. 2014 ప్రభుత్వంలో కూడాసీనియర్లకు పెద్దగా ప్రాధాన్యత లభించలేదు. 2019 ఎన్నికల్లో టిడిపి ఓడిపోయినా సీనియర్లు, కార్యకర్తలు మాత్రం పార్టీలోనే కొనసాగుతున్నారు. 2024లోనూ తిరిగి టిడిపి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పదినెలలుపైగా కావస్తున్నా బాబు సొంత జిల్లాలో కొందరు సీనియర్లు పార్టీని ప్రాణంగా నమ్ముకున్న వారికి తగిన గుర్తింపు లేదనే ఆవేదనతో రానున్న రోజుల్లో ఏం జరగనుందనేది వేచిచూడాల్సిందే.

## చదువుకున్న కుటుంబం...
# దేశానికే ఆదర్శం

**-పార్టీలకతీతంగా సంక్షేమ పథకాలు**
**-యువత విద్యలో రాణించాలి**
**- రాష్ట్ర, జిల్లా ఇన్‌చార్జి మంత్రి మండిపల్లి**

చౌడేపల్లి, మే 16 ప్రభాతవార్త: కుటుంబంలో అందరూ విద్యనభ్యసించి దేశానికే ఆదర్శం కావాలని రాష్ట్ర రవాణా, యువజన, చిత్తూరు జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. మండలంలోని కాటిపేరి పంచాయతీ అగస్తిగానిపల్లి సమీపంలో ఆచార్య ఎన్జీరంగా విశ్వ విద్యాలయం వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు కేటాయించిన 58ఎకరాల్లో రూ. 2.74కోట్లతో నిర్మించిన నూతన భవనాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ప్రసంగిస్తూ యువత విద్యలో రాణించినప్పుడే కుటుంబం, దేశం బాగుపడుం దన్నారు. ముఖ్యంగా వ్యవసాయ రంగంలో అడుగుపెట్టి నూతన ఒరవుడలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యాక సంక్షేమ పథకాల అమలులో పార్టీలు చూడలేదన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో సుభిక్ష పరిపాలన నడుస్తోందన్నారు. సొంత జిల్లా వాసిగా జిల్లాలో మహోన్నత కార్యక్రమాలకు శ్రీకారం చుడుతున్నారన్నారు. అన్నిటికంటే విద్యారంగానికి ప్రాముఖ్యత ఇస్తున్నామన్నారు. మహిళల ఆర్థిక స్వాలంభనకు అనేక పథకాలు రూపొందించి అమలు చేస్తున్న ఘనత కూటమి ప్రభుత్వ సారధి నారా చంద్ర బాబునాయుడుకు దక్కిందన్నారు. దీపం-2లో భాగంగా సంవత్సరానికి 3సిలండర్ల ఉచిత గ్యాస్ పథకాన్ని విజయంతంగా ముందుకు తీసుకెళుతున్నా మన్నారు. ఇందుకు అయ్యే ఖర్చు సుమారు రూ 3.500కోట్లు రాష్ట్ర ప్రభుత్వం భరిస్తోందన్నారు. తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి పథకాలను త్వరలో ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. పాడి, మామిడి రైతులను ఆదుకొనే దిశగా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకొంటోందనీ, మామిడికి, పాలకు గిట్టుబాటు ధర కల్పించే దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సారధ్యంలోని కూటమి ప్రభుత్వం అడుగులేస్తుందన్నారు. జిల్లాలోనే మొదటి సారి వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాలకు భవనాన్ని ఏర్పాటు చేసుకోవడం ఆనంద దాయకమన్నారు. సువిశాల పూర్తి మౌళిక సదుపాయాలతో నిర్మించారనీ, వ్యవసాయ రంగంలో మెళుకువలు సంపాదించుకోవాలన్న యువతకు భవిష్యత్తులో ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం ఉపయోగకరంగా ఉంటుందన్నారు. అనంతరం పుంగనూరు తిరుపతి వయా భాకరాపేట, పుంగనూరు-కుప్పం ఆర్టీసీ సర్వీసులను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్, పుంగనూరు నియోజకవర్గ తేదేపా ఇన్‌ఛార్జ్ చల్లా రామచంద్రారెడ్డి, మండల టిడిపి అధ్యక్షుడు గువ్వల రమేష్‌రెడ్డి(చిట్టి), లక్ష్మణరాజు (పతిరాజు), జనసేన పడగాల రమణ, విశ్వవిద్యాలయం ఎడిఆర్ తిరుపతి డాక్టర్ సుమతి, సత్యనారాయణ, ప్రిన్సిపాల్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయాధికారి మురళి, ఆర్డీఓ భవానీ, తహశీల్దార్ హనుమంతు, ఎంపిడిఓ లీలామాధవి, ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.


సమావేశంలో పాల్గొన్న మంత్రి, కలెక్టర్ తదితరులు

# నామినేటెడ్ పదవులలో...బిసిలకు చేదు అనుభవం



పలమనేరు,ఏప్రిల్ 16 ప్రభాతవార్త: ఏ ప్రభుత్వం వచ్చినా బిసిలకు సరైన గుర్తింపు మాత్రం దక్కడం లేదు.ఏ ప్రభుత్వాలు అధికారంలోకి రావాలన్నా మొదట బిసిలకు ప్రాధాన్యత అంటు ప్రచారాలు చేస్తూ అధికారంలోకి వస్తు అధికారం అందిన వెంటనే బిసిలను ఒక ఓటు బ్యాంకుగా పరిగణిస్తూ పక్కన పెట్టడం జరుగుతుంది. రిజర్వేషన్ల ప్రక్రియలో బిసిలకు పలు నామినేటెడ్ పదవులు ప్రకటించినప్పటికి ఆ పదవులు నాయకుల కోసం,పార్టీల కోసం కృషి చేసిన వారికి మాత్రం దక్కకపోవడం,పార్టీలు కష్టకాలాలలో ఉన్న సమయంలో అందగా ఉన్న బిసిలకు సరైన గుర్తింపు లేకపోవడం ఇందుకు నిదర్శనం. నామినేటెడ్ పదవులు పార్టీలో ఎప్పుడు కానరాని,అధికార ప్రతినిధుల అందదండాలు ఉన్న వారిని వరించడం పార్టీ కోసం కష్టపడిన అసలైన బీసిలకు ప్రస్తుతం మింగుడుపడడం లేదు.ప్రస్తుతం టిడిపి ప్రభుత్వం పలు నామినేటెడ్ పదవులను ప్రకటించడం తెలిసిందే.అయితే పలమనేరు నియోజకవర్గంలో మాత్రం పార్టీ కోసం కృషి చేసిన వారికి పార్టీ కష్టకాలాలో ఉన్న సమయంలో అండగా ఉంటు అప్పటి అధికార పార్టీ ఒత్తిడ్లకు లొంకకుండా అనేక కేసులు పెట్టించుకున్న వారికి మాత్రం పదవులలో న్యాయం జరగలేదని బిసి నాయకుల నోట గుసగుసలు వినిపిస్తుంది.ఇప్పటి వరకు పలు నామినేటెడ్ పదవులను టిడిపి ప్రభుత్వం బిసిలకు ప్రకటించింది. అయితే అందులో పలమనేరు నియోజకవర్గం బిసి నాయకులకు మాత్రం సముచిత స్థానం దక్కలేదు.దీంతో అధికార పార్టీ బిసి నాయకలు అంతర్మదనంలో పడ్డారు.

**అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లకపోవడమే కారణమా:**

పలమనేరు నియోజకవర్గంలో సుమారు లక్షకుపైగా బిసి ఓటర్లు ఉన్నారు. ప్రతి ఎన్నికలలో నాయకుల విజయం నిర్ణయించేది బిసిలు కాగా ఇప్పటి వరకు టిడిపి కోసం కృషి చేసిన నియోజకర్గ బిసిలకు అధిష్టానం నుండి సరైన గుర్తింపు లేదు. ఇప్పటి వరకు టిడిపి ప్రభుత్వం ప్రకటించిన నామినేటెడ్ పదవులలో పలమనేరు నియోజకవర్గ బిసి నేతలకు గుర్తింపు లేకపోవడం ఇందుకు నిదర్శనం. నియోజకవర్గంలో టిడిపి గెలుపుకు బిసి నేతలు కృషి లేదా... లేక వారి కృషిని అధిష్టానం దృషికి తీసుకువెళ్లక పోవడం ఇందుకు కారణమా అన్నది స్థానిక బిసి నేతలకు అంతుచిక్కడం లేదు.

**మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఎవరిని వరిస్తుంది:**

నియోజకవర్గంలో బిసి నేతలకు చొప్పుకునే విధంగా ఎటువంటి నామినేటెడ్ పదవులు లేకపోవడంతో బిసిల ఎదురుచూపు పలమనేరు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి వైపే ఉంది. ఇటీవల ప్రభుత్వం పలమనేరు మార్కెట్‌కమిటీ బిసి మహిళకు కేటాయించింది. దీంతో పలమనేరు నియోజకర్గంలోని బిసి నేతలు తమ కంటే తమ కంటూ ఎమ్మెల్యే చుట్టూ ప్రదక్షణలు చేస్తున్నారు. అయితే బిసి సామాజిక వర్గంలో ఓటర్లను అధికంగా వడ్డెర, కురబగౌడ, వాల్మీకిల సొంతం. దీంతో ఆ సామాజికవర్గం బిసిలు తమ వర్గానికి ప్రాధాన్యత ఇవ్వా లంటు తమకు మార్కెట్ కమిటీ పదవి ఇప్పించాలని ఎమ్మెల్యేపై ఒత్తిడి తీసుకువస్తున్నట్లు సమాచారం.అయితే ఇప్పటి వరకు నియోజవర్గంలోని వడ్డెరులకు టిడిపి ప్రభుత్వంలో సముచిత స్థానం లేదని తమ సామాజిక వర్గం మహిళకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఇవ్వలని,మరోవైపు కురబగౌడ,వాల్మీకిలు తమ సామాజికవర్గం మహిళకు మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పదవి ఇవ్వలని వారి వంతు ప్రయత్నాలను చేస్తున్నట్లు తెలుస్తూంది. ఏదేమైనప్పటికి పలమనేరు ఎమ్మెల్యే ఏ సామాజికవర్గం బిసిలకు ప్రాధాన్యత ఇస్తారో..అలా ఓ వర్గానికి ప్రాధాన్యత ఇస్తే మిగిలిన బిసిలు ఎలా స్పందిస్తారో వేచి చూడాల్సి ఉంది.

**- నేటి నుంచి కౌంట్ డౌన్**

# 101 రెడీ

**- రేపు ఉదయం 5.59 గంటలకు పిఎస్ఎల్‌వి-సి61 ప్రయోగం**
**- 'నిసార్'కు ముందే 'సార్' ప్రయాణం**

శ్రీహరికోట (తడ), మే 16 ప్రభాతవార్త : శ్రీహరికోట నుంచి జరుగుతున్న పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్ ప్రయోగానికి కొన్ని ప్రత్యేకతలు ఉన్నాయి. ఈ ఏడాది శ్రీహరికోట నుంచి 100వ రాకెట్‌ను ప్రయోగించిన ఇస్రో పిఎస్ఎల్‌వి-సి61 పేరుతో 101వ ప్రయోగానికి సిద్ధమైంది. షార్‌లో రాకెట్ ప్రయోగ వేదిక ఏర్పాటైన తర్వాత త్వరత్వరగా 100ను దాటిన ఇస్రో ఇప్పుడు అత్యంత కీలకమైన మన దేశానికి రక్షణ కల్పించే ఇఓఎస్09 ఉపగ్రహాన్ని ప్రయోగిస్తున్నారు. ఈ ఉపగ్రహానికి పలు ప్రత్యేకతలు ఉన్నాయి. ఇది ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్..అంటే భూ పరిశీలన ఉపగ్రహం. రీశాట్ 2బిగా కూడా దీన్ని పేర్కొంటున్నారు. రిమోట్ సెన్సింగ్ సేవలు దీని ద్వారా అందుతాయి. ఇది కాకుండా ఇందులో అమర్చిన సింథటిక్ అపెర్చర్ రాడార్ (సార్) పేలోడ్ ప్రత్యేకమైనది. నాసా, ఇస్రో సంయుక్తంగా రూపొందించిన నిసార్ ఉపగ్రహ ప్రయోగం ముందుగా జరగాల్సి ఉంది. నిసార్‌ను గురువారం శ్రీహరికోటకు కూడా చేర్చారు. ఇందుకోసం జిఎస్ఎల్‌వి-ఎఫ్16 రాకెట్ సిద్ధమవుతోంది. అయితే ఈ నిసార్‌కి ముందే సార్ ప్రయోగం చేపట్టారు. ఇఓఎస్09లోని సింథటిక్ అపెర్చర్ రాడార్ విలువైన సేవలను శాస్త్రవేత్తలకు అందించనుంది.

**నేటి ఉదయం నుంచే కౌంట్‌డౌన్ :**

పిఎస్ఎల్‌వి-సి61 రాకెట్‌కు సంబంధించి శనివారం ఉదయం 7.59 గంటలకు కౌంట్‌డౌన్ ప్రారంభించనున్నారు. రెండు, నాలుగవ దశల్లో ద్రవ ఇంధనాన్ని ఈ సమయంలోనే నింపుతారు. అనంతరం 22 గంటలకు అంటే ఆదివారం ఉదయం 5.59 గంటలకు రాకెట్ ప్రయోగం చేపట్టనున్నారు. ఇస్రో చైర్మన్ శుక్రవారం షార్‌లో శాస్త్రవేత్తలతో సమావేశాలు జరిపారు. లాంచ్ ఆథరైజేషన్ బోర్డ్, మిషన్ రెడీనెస్ రివ్యూ వంటి సమావేశాలు జరుగుతున్నాయి. షార్‌లో రాకెట్ ప్రయోగాన్ని తిలకించేందుకు ఈ సారి పార్లమెంటరీ కమిటీలోని 16 మందికి పైగా సభ్యులు శనివారం విచ్చేయనున్నారు. శ్రీహరికోటలో మూడు రోజులు ముందు నుంచే పటిష్టమైన బందోబస్తు ఏర్పాట్లు మొదలయ్యాయి. శుక్రవారం తిరుపతి జిల్లా పోలీసు అధికారులు కూడా సమావేశమయ్యారు. సిఐఎస్ఎఫ్ దళాలు సూళ్లూరుపేట, శ్రీహరికోట మార్గంలోను విస్తృత తనిఖీలు చేపట్టారు. ఈ సారి సందర్శకుల గ్యాలరీకి అనుమతించకపోవడంతో ఉదయం పూట ప్రయోగం కావడం వలన ఆ అద్భుత ఘట్టాలు చూసేందుకు, చిత్రీకరించేందుకు పులికాట్ సరస్సు ఒడ్డున ఔత్సాహికులు, సందర్శకులు బారులు తీరే అవకాశం ఉంది.


భారత ఎర్త్ అబ్జర్వేషన్ శాటిలైట్ ఇఓఎస్09
-ప్రస్తుతం ఉపగ్రహం ఈ హీట్‌షీల్డ్‌లోనే ఉంది

# స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు మహర్ధశ!

**-ఆర్థిక భారమంతా ప్రభుత్వమే భరిస్తుంది**
**-దేవస్థానం కాణిపెట్టాల్సిన అవసరం లేదు**
**-ఈ విద్యాసంవత్సరం నుంచే అడ్మిషన్లకు కసరత్తు**




శ్రీకాళహస్తి,మే 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా నాటి మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రతిష్టాత్మకంగా నిరుపేద విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్యను అందించుటకు ఏర్పాటు చేసిన స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల పునఃప్రారంభానికి పట్టువదలని విక్రమార్కునిలా పట్టుబిగించి ఉన్నత విద్యాశాఖమంత్రి నారా లోకేష్‌ను ఒప్పించి పునఃప్రారంభానికి ఆర్థికంగా బలపడే వరకు అయ్యే ఖర్చులన్నీ ప్రభుత్వమే భరించుటకు అంగీకరించినట్లు శాసనసభ్యుడు బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి శుక్రవారం ప్రభాతవార్తకు వివరించారు. శ్రీకాళహస్తీశ్వరాలయానికి సంబంధించిన ఇంజనీరింగ్ కళాశాల 2014 నుంచి నిర్వహణ కష్టంగా మారింది.మూడేళ్ళ పాటు దేవస్థానం కళాశాల సిబ్బందికి జీతభత్యాలు భరించింది. తరువాత చేతులెత్తేసింది. దాంతో 2019 నుంచి కళాశాల మూతపడింది. అడ్మిషన్లు ఆగిపో యాయి. ఇక్కడ చదివిన మొదటి నాలుగు బ్యాచ్‌ల విద్యార్థులు ఉన్నతస్థానంలో, ఉన్నత స్థితిలో ఉన్నారు.అయితే కళాశాల మూత పడింది.

**ప్రభుత్వమే అంతా భరిస్తుంది:**

శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఎన్నికలకు ముందు యువగళం పాదయాత్రలో ప్రస్తుత విద్యాశాఖ మంత్రి నారాలోకేష్ వచ్చినపుడు ఇంజనీరింగ్ కళాశాల సమస్య ఆయన దృష్టికి వచ్చింది. అప్పుడు ఆయన హామీ ఇచ్చారు.కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ఏడాది ఎలాగైనా స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలకు పూర్వవైభవం తీసుకురావటానికి ఎంఎల్ఏ సుధీర్‌రెడ్డి పట్టుబట్టారు. పలుమార్లు దేవాదాయ శాఖ, ఉన్నత విద్యామండలితో సమావేశం జరిపారు. ప్రతి రోజూ నారాలోకేష్‌తో స్కిట్ ఇంజనీరింగ్ కళాశాల సమస్యను తీసుకొచ్చారు. ఇటీవల విద్యాశాఖ దేవాదాయశాఖ, అనంతపురం జేయన్‌టి యుతో కీలక సమావేశం జరిగినట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు. మొదటి బైలాయిం పుల్లో రెండేళ్ళు పాటు దేవాదాయశాఖ కళాశాల ఆర్థిక పరిస్థితి బాగుపడే వరకు భరించుటకు ప్రతిపాధించారు. ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన తరువాత జెయన్‌టియు తిరిగి చెల్లించుటకు ఓ ప్రతిపాదన రూపొందించారు.ఈ ప్రతిపాదనలతో నారాలోకేష్ సమావేశం జరిపినపుడు దేవాదాయశాఖ నుంచి ఒక్క పైసా అవసరం లేదని కళాశాల ఆర్థిక పరిపుష్టి సాధించే వరకు ప్రభుత్వమే భరించుటకు నిర్ణయించినట్లు సుధీర్‌రెడ్డి తెలిపారు.నారా లోకేష్‌కు ఎలా ధన్యవాదాలు తెలపాలో అర్థకం కావటం లేదన్నారు.

**అడ్మిషన్లకు సన్నాహాలు:**

శ్రీకాళహస్తిలోని స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను అనంతపురంలోని జెయన్‌టి యుకు లీజు ప్రాతిపదిక మీద అప్పగించబడుతుందన్నారు. వారు దేవస్థానంకు లీజు చెల్లిస్తారని నిర్వహణ అంతా వారే చూసుకుంటారని ఎంఎల్ఏ వివరించారు. అందుకు స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను ముస్తాబు చేయాలని ఆదేశించారు. మరమ్మతులకు సుమారు రూ.కోటి వరకు అవుతుందని దేవస్థానం ఇంజనీర్లు అంచనా కట్టారు. ఈ మొత్తాన్ని కూడా ప్రభుత్వమే భరించుటకు అంగీకరించినట్లు ఎంఎల్ఏవివరించారు.నిరుపేద విద్యార్థులకు స్థానికంగా ఉంటూ అభ్యసించుటకు ఎంఎల్ఏ చొరవను విద్యావంతులు అభినందిస్తున్నారు.

# స్వర్ణరథంపై అలరించిన విఘ్ననాధుడు



కాణిపాకం, మే 16 ప్రభాతవార్త: కాణిపాకం వరసిద్ధి వినాయకస్వామివారి దేవస్థానంలో శుక్రవారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులకు అభయ హస్తం అందించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్ధి రోజున రాత్రి స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు ప్రధాన ఆలయంలోని అలంకార మండపంలో ఉదయం 10 గంటలకు, సాయంత్రం 5 గంటలకు సంకటహర చతుర్ధి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా సిద్ధి, బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను అలంకార మండపంలో వుంచి సర్వాంగ సుందర ంగా అలంకరించి వేద పండితుల మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం మంగళవాయిద్యాల నడుమ మిరమిట్లు గొలుపుతున్న అలంకరించిన స్వర్ణరథంపై వుంచి మరోమారు అర్చకులు ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు వాసు, కోదండపాణి,టెంపుల్ ఇన్స్‌పెక్టర్ బాలాజినాయుడు, రవి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## ఒకే రాత్రి మూడు గ్రామాల్లో...
# 40 స్టార్టర్స్ చోరీ

**-పెరుగుతున్న స్టార్టర్ చోరీలు- ఆందోళన లో రైతులు**


స్టార్టర్లు చోరీ జరగగా ఖాళీగా కనబడుతున్న బోర్డులు

శ్రీకాళహస్తిరూరల్,మే 16 ప్రభాతవార్త : అసలే వ్యవసాయం ఎత్తుభారంగా సాగుతున్న రోజులు. పెట్టుబడులు రాక వడ్డీలు చెల్లించుకోలేక అన్నదాతలు అల్లాడుతున్నారు. అయితే ఏర్పేడు మండలంలో మళ్ళీ వ్యవసాయబావుల వద్ద మోటార్లకు ఏర్పాటు చేసిన స్టార్టర్లు చోరీలు మొదలయ్యాయి. ఒకే రాత్రి మూడు గ్రామాల్లోని వ్యవసాయ బావుల వద్ద ఏర్పాటు చేసిన 40 స్టార్టర్లు, చోరికి గురయ్యాయి.ఈ మేరకు రైతులు ఏర్పేడు పోలీసులకు తమ బాధలను ఫిర్యాదు చేసారు. ప్రస్తుతం ఒబ్బిళ్లు పూర్తి అయ్యాయి.దాంతో రైతులు పంట పొలాల్లో ఉండటం లేదు. ఇదే అదనుగా దొంగలు ఒకే రాత్రి మొత్తం స్టార్టర్లు విప్పుకొని వెళ్ళారు.మండలంలోని చెల్లూరు, కుమ్మరకండ్రిగ, గుండ్ల కండ్రిగ గ్రామాల్లోని 40 మంది రైతులకు సంబంధించి విద్యుత్ స్టార్టర్లు విప్పుకొని వెళ్ళారు. దాంతో ఇప్పుడిప్పుడే వర్షాలు కురుస్తున్నాయి. కాబట్టి వ్యవసాయం పనులు ప్రారంభించాలి. ఈ గ్రామాలన్ని స్వర్ణముఖి తీరాన ఉండటంతో వ్యవసాయం మొదలైతే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. వ్యవసాయానికే పెట్టుబడుల కోసం వెంపర్లాడుతున్న తరుణంలో చోరీలతో తల్లడిల్లుతున్నారు.

# రాజ్యాంగ రక్షకులు మీరే

**- మహోద్యమ నిర్మాణాలకు తిరుపతి నాంది కావాలి - సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ -బాధ్యత నేటి యువతదే : జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పిలుపు**


ఏఐవైఎఫ్ 17వ జాతీయ సభలో ప్రసంగిస్తున్న కె.నారాయణ, జస్టిస్ జాస్తి చలమేశ్వర్

తిరుచానూరు, మే 16 ప్రభాతవార్త : రాజ్యాంగం గురించి ఏ మాత్రం అవగాహన లేని, గౌరవంలేని శక్తులు ప్రస్తుతం దేశాన్ని పాలిస్తున్నాయని, రాజ్యాంగ పవిత్రతకు ప్రమాదం వాటిల్లుతున్న నేపథ్యంలో నేటి యువత అప్రమత్తం కావాల్సిన తరుణం ఆసన్నమైందని సీపీఐ జాతీయ కార్యదర్శి, అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) 17వ జాతీ మహాసభల ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ కె.నారాయణ అన్నారు. ఏఐవైఎఫ్ మహాసభలు సందర్భంగా శుక్రవారం నాడు తిరుపతిలోని కామ్రేడ్ కనం రాజేంద్రన్ హాలులో ప్రతినిధుల సభ ప్రారంభమైంది. నారాయణ ఆహ్వాన సంఘం తరపున అధ్యక్షోపన్యాసం చేస్తూ, ఆర్ఎస్ఎస్ ప్రేరేపిత బీజేపీ పాలనలో రాజ్యాంగ వ్యవస్థలు అవమానాలను ఎదుర్కొంటున్నాయని, గవర్నర్ల అధికారాల విషయంలో ఇటీవల సుప్రీంకోర్టు ధర్మాసనం చేసిన వ్యాఖ్యలను రాష్ట్రపతి సైతం ఖండించిన తీరు చూస్తుంటే, రాజ్యాంగానికి ముప్పు పతాకస్థాయికి చేరిందని ఆక్రోశించారు. ఈ పరిణామాల పట్ల యువత అప్రమత్తం కావాలని కోరారు. మహోన్నత ఉద్యమ చరిత్ర కలిగిన ఏఐవైఎఫ్ జాతీయ మహాసభల ఆహ్వాన సంఘానికి చైర్మన్‌గా ఉండటం తనెంతో గర్వంగా ఉందని నారాయణ అన్నారు. ఏఐవైఎఫ్ అని, అన్ని స్థాయిలలో అవినీతికి వ్యతిరేకంగా నేటికీ పోరాడుతూ, అప్రమత్తంగా ఉంటున్నదన్నారు. దళితులు, ఆదివాసీలు, మహిళలు, మైనారిటీలు వంటి అణగారిన వర్గాలను రక్షించడంలో,వారిపై దాడులు, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా ఏఐవైఎఫ్ ఎల్లప్పుడూ ముందంజలో ఉంటుందని నారాయణ చెప్పారు. మాదకద్రవ్యాల మాఫియా, అశ్లీల సాహిత్యాన్ని, బాల్య వివాహాలు, వరకట్న వ్యవస్థ వంటి అన్ని సామాజిక దురాచారాలను నిర్మూలిం చడంలో కీలక పాత్ర పోషస్తోందన్నారు. విప్లవ రచయితలకు, కమ్యూనిస్టు ఉద్యమాలకు పెట్టనికోట అని అన్నారు. తిరుపతి విద్యార్థుల ఆందోళనలకు పుట్టినిల్లు అని అన్నారు. ఇలాంటి చరిత్ర కలిగిన తిరుపతిలో జరుగుతున్న ఏఐవైఎఫ్ మహాసభల్లో ప్రతినిధులు చురుగ్గా పాల్గొని, దేశ ప్రజాస్వామ్య పరిరక్షణ దిశగా మంచి నిర్ణయాలు తీసుకోవాలని కె.నారాయణ ఆశాభావం వ్యక్తం చేశారు. మహోద్యమ నిర్మాణాలకు ఇది నాంది కావాలని ఆకాంక్షించారు.

**- ప్రజాస్వామ్య పరిరక్షణ బాధ్యత యువతదే: జస్టిస్ జాస్తి చలమేశ్వర్**

తీవ్ర సంక్షుభిత పరిస్థితులను ఎదుర్కొంటున్న ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత నేటి యువతదేనని హైకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ జాస్తి చలమేశ్వర్ పిలుపునిచ్చారు. ఏఐవైఎఫ్ 17వ జాతీయ మహాసభల సందర్భంగా తిరుపతిలోని ప్రతినిధుల సభను ముఖ్య అతిథిగా పాల్గొని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఎన్నికల్లో వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్న పాలకులు దేశ అభివృద్ధిలో ఇసుమంత పాత్రను కూడా పొందలేకపోతున్నారని అన్నారు. ఒక్కొక్క పార్లమెంట్ సభ్యుడు సగటున ఎన్నికల్లో 50 నుండి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చు పెడుతున్నారని తెలిపారు. గెలిచిన అనంతరం వారు ఎంతవరకు ప్రజలకు సేవ చేస్తారు. అనే అంశాన్ని ప్రతి ఒక్కరు ప్రశ్నించుకోవాలని సూచించారు. దేశంలో ఎన్నికల నిర్వహణ ఖర్చులో కూడా మార్పు రావాలని సూచించారు. ఎన్నికల సంస్కరణలు జరగకపోతే, దేశానికి ప్రజాస్వామిక భవిష్యత్ ఉండబోదనని హెచ్చరించారు.దేశంలో ప్రజాస్వామ్యం అనే పదమే అదృశ్యమయ్యే పరిస్థితులు నెలకొంటున్నాయని ఆవేదన వెలిబుచ్చారు. ఈ తరుణంలో యువత దీనిపై సంపూర్ణ అవగాహన పొంది ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత తమ భుజస్కందాలపైకి ఎత్తుకోవాలని పిలుపునిచ్చారు.

## తిరిచ్చిపై విహరించిన శ్రీ మహాలక్ష్మి

తిరుచానూరు, మే 16, ప్రభాతవార్త : తిరుచానూరులో పద్మావతి అమ్మవారు తిరుచిపై తిరుమాడ వీధులలో విహరిస్తూ భక్తులకు అభయమిచ్చారు. ప్రతి శుక్రవారం సేవలో భాగంగా పద్మావతి అమ్మవారిని సుప్రభాతంతో మేలుకొలుపు సహస్రనామార్చన నిత్య నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖమండపం వద్ద కల్యాణోత్సవం వైభవంగా చేపట్టారు. అనంతరం వాహన మండపం వద్ద పద్మావతి అమ్మవారిని సుందరంగా అలంకరించి తిరుచ్చిపై కొలువుతీర్చి తిరుమడవీధులలో ఊరేగించారు. స్థానికులు భక్తులు పెద్ద ఎత్తున కర్పూర నీరాజనాలతో అమ్మవారికి మొక్కులు చెల్లించుకున్నారు.

## డెంగ్యూపై అప్రమత్తం



**గుడిపాల, మే 16 ప్రభాతవార్త:** డెంగ్యూ జ్వరంపై ప్రతి ఒక్కరు అప్రమత్తంగా వుండాలని గుడిపాల పిహెచ్‌సి డాక్టర్ సంధ్య పిలుపునిచ్చారు. జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం గుడిపాల పిహెచ్‌సి పరిధిలోని ప్రజలకు డాక్టర్ సంధ్య అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ డెంగ్యూ జ్వరం ఆడ ఏడిస్ దోమలు కుట్టడం ద్వారా వస్తుందన్నారు. వర్షాకాలంలో దోమలు ఎక్కువగా వృద్ధి చెంది డెంగ్యూ జ్వరానికి కారణం అవుతున్నాయన్నారు. డెంగ్యూ జ్వరం సోకిన వారికి జ్వరంతో పాటు తలనొప్పి, దద్దుర్లు, కండరాలు, కీళ్ళలో నొప్పి వస్తుందన్నారు. దోమలు వృద్ధి కాకుండా పరిసరాలను ప్రతి ఒక్కరు పరిశుభ్రంగా వుంచుకోవాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## రూ.75 లక్షలతో అభివృద్ధి పనులు

**– పంచాయతీ సర్వసభ్య సమావేశంలో సర్పంచ్ హరిణి**



**గుడిపాల, మే 16 ప్రభాతవార్త:** రామభద్రాపురం గ్రామ పంచాయతీని 75 లక్షల రూపాయలు వ్యయం చేసి అభివృద్ధి పనులు చేపట్టినట్లు సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు పేర్కొన్నారు. రామభద్రాపురం గ్రామ పంచాయతీ సర్వసభ్య సమావేశం శుక్రవారం సర్పంచ్ హరిణి హేమాద్రినాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఎంపిడిఓ శిరీష హాజరై క్షేత్ర స్థాయిలో పంచాయతీ పరిధిలో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ పంచాయతీని పక్కాగా అభివృద్ధి చేయడానికి పంచాయతీ భవన నిర్మాణంతో పాటు ప్రజల మంచినీటి సమస్యను పరిష్కరించడానికి మూడు బోర్లను డ్రిల్ చేయడం జరిగిందన్నారు. అలాగే పంచాయతీ పరిధిలో సిమెంటు రోడ్ల నిర్మాణాలు, వంతెనలు నిర్మించడం జరిగిందన్నారు. పంచాయతీ అభివృద్ధికి ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు పూర్తి సహకారం అందిస్తున్నారని, 2025-26 ఆర్థిక సంవత్సరానికి పంచాయతీ అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేసి ఎంపిడిఓ శిరీష సమక్షంలో వార్డు సభ్యులతో చర్చించి ఆమోదించారు.

## కాణిపాకంలో ఘనంగా సంకటహర గణపతివ్రతం

**–కిక్కిరిసిన ఆస్థానమండపం**



**కాణిపాకం, మే 16 ప్రభాతవార్త:** కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో శుక్రవారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహిస్తుంటారు. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాధుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ వేదపండితులు సంకష్ట చతుర్థి వ్రతం మహాత్యాన్ని గురి ంచి వివరించారు. ఈవ్రతంను ఆచరించడం వల్ల భక్తులకు ఈతిబాధలు, కష్టాలు తొలగి అనుకున్న కోరికలు నెరవేరి అంతా శుభం కలుగుతుందని పురాణాలు స్పష్టం చేస్తున్నాయని వేదపండితులు పేర్కొన్నారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించుకోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది. ఆలయ అధికారులు, ఆస్థాన మండపంలో భక్తులు సకాలంలో వ్రతాన్ని నిర్వహించడానికి ప్రత్యేక ఏర్పాటు చేశారు. ఇదిలా వుండగా పాఠశాలలకు వేసవి సెలవులు కావడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా సంకట హర గణపతివ్రతంకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ పెంచల కిషోర్, ఏఈఓ రవీంద్రబాబు, సూపరెండెంట్‌లు కోదండపాణి, వాసు, ఆలయ అర్చకులు వేదపండితులు, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు బాలాజినాయుడు,రవి, అర్చకులు, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## గణనాధుని దర్శించుకున్న పాట్నా హైకోర్టు న్యాయమూర్తి



**కాణిపాకం, మే 16 ప్రభాతవార్త:** పాట్నా రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుకుమార్ చక్రవర్తి శుక్రవారం కుటుంబసమేతంగా కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ దర్శనార్థం వచ్చిన ఆయనకు ఆలయ ఏఈఓ రవీంద్రబాబు, అర్చకులు ఆలయ మర్యాదలతో రాజగోపురం వద్ద ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం వారు స్వామివారి సేవలో పాల్గొన్నారు. వారికి వేదమంపడపంలో వేదపండితులు ఆశీర్వచనం చేసి స్వామివారి శేషవస్త్రాలను, ప్రసాదాలను అందజేశారు. అనంతరం శ్రీవీరాంజనేయస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలలో కూడా పూజలు నిర్వహించారు.వారి వెంట ఆలయ సూపరెండెంట్‌లు వాసు, కోదండ పాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్‌లు రవి, బాలాజినాయులతో పాటు కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## మాదిగ బిడ్డల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ

**– ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణ రాజు**



**పుంగనూరు, మే 16, ప్రభాతవార్త** రాష్ట్రం మాదిగల పోరాటంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు సువర్ణ రాజు అన్నారు. శుక్రవారం పట్టణంలో ఏపీ ఎమ్మార్పీఎస్ కార్యాలయాన్ని ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దపల్లి శేఖర్ తో కలిసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోస మాదిగ బిడ్డలు 30 ఏళ్ల పోరాటం చేశారన్నారు. గల్లీలో ఉద్యమించిన ఎస్సీ వర్గీకరణ ఉద్యమం ఢిల్లీ పీఠాన్ని కదిలించిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు చిన్న రాయుడు, జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులు డాక్టర్ బాణావత్ మునీంద్ర నాయక్, రాజంపేట పార్లమెంట్ బిజెపి ఉపాధ్యక్షులు అయుబ్ ఖాన్, రాజు, రామయ్య ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనారిటీ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతి గంగమ్మను దర్శించుకున్న మంత్రి నిమ్మల



**కుప్పం, మే 16 ప్రభాతవార్త** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం రాత్రి కుప్పంలో వెలసిన శ్రీ తిరుపతి గంగమ్మ అమ్మవారిని దర్శి ంచుకున్నారు. ఒక్కరోజు కుప్పం పర్యటనకు వచ్చిన మంత్రి ఆలయంకు చేరుకున్నారు. ఈసందర్భంగా మంత్రికి ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్రబాబు స్వాగతం పలికారు. అనంతరం మంత్రి అమ్మవారిని దర్శించుకున్నాక అమ్మవారి వస్త్రాలు, తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అగ్నిప్రమాదాలపై మాక్ డ్రిల్ నిర్వహణ



**కుప్పంరూరల్, మే 16 ప్రభాతవార్త :** అగ్నిప్రమాదాలు, యుద్ధాలు, ఎయిర్ స్ట్రైక్ సంభవించిన సమయంలో జరిగే ప్రమాదాల గురించి ప్రజలరక్షణకు తీసుకునే చర్యల గురించి శుక్రవారం కుప్పం ఆర్డీఓ శ్రీనివాసులురాజు అధ్వర్యంలో ఫైర్ అధికారి ప్రవీణ్‌కుమార్ కుప్పం బస్టాండులో మాక్ డ్రిల్ నిర్వహించారు. ప్రజలను సురక్షితంగా కాపాడడం, అగ్నిప్రమాదాల నివారణ తదితరాలపై ప్రత్యక్షంగా ప్రదర్శన చేపట్టారు. కార్యక్రమంలో డిఎస్పీ పార్థసారథి, తహశీల్దార్ చిట్టిబాబు, అర్బన్ సిఐ శంకరయ్య, రెస్కో ఎండి సోమశేఖర్, డిఇ ప్రభాకర్, వైద్యులు, రెవెన్యూ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## చెరువుల సంరక్షణ బాధ్యత అధికారులదే : ఎమ్మెల్యే



**వి.కోట, మే 16 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో చెరువుల సంరక్షణ బాధ్యత అధికారులదేనని ఎమ్మెల్యే అమరనాథరెడ్డి ఆదేశించారు. వి.కోట పట్టణ ప్రధాన చెరువు దురాక్రమణకు గురికావడంతో పాటు పెద్ద ఎత్తున చెత్తను డంప్ చేస్తున్నారని స్థానికులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన స్థానిక ఆర్‌అండ్‌బి అతిథిగృహంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. గత ప్రభుత్వ హయాం నుంచే చెరువులో చెత్తను డంప్ చేస్తున్నట్లు అధికారులు తెలపడంతో ఆయన ఆగ్రహించారు. తగు చర్యలకు ఆదేశించారు. సమావేశంలో నేతలు రామచంద్రనాయుడు, రంగనాథ్, రాంబాబు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారం



**కుప్పంరూరల్, మే 16 ప్రభాతవార్త:** మండలంలోని రాగిమానుమిట్ట గ్రామంలో మంచినీటి సమస్యను నేతలు, అధికారులు పరిష్కరించారు. సిఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలతో గ్రామంలో ఐదు లక్షల రూపాయలతో నూతన బోరు, మోటారు ఏర్పాటుచేయగా శుక్రవారం మండల టిడిపి అధ్యక్షుడు ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. గ్రామస్తులు సిఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పోరేషన్ డైరెక్టర్ రాజగోపాల్, కడ కమిటీ సభ్యుడు రామచంద్ర, నేతలు శివకుమార్, మోహన్, రిజ్వాన్, రామచంద్ర, గఫార్, అక్మల్ పాల్గొన్నారు

## డెంగ్యూ వ్యాధి నివారణకు కృషి చేయాలి



**సదుం, మే 16 ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ దోమల బారిన పడకుండా డెంగ్యూ వ్యాధి నివారణకు కృషి చేయాలని చెరుకువారి పల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ గిరీష అన్నారు. శుక్రవారం మండల పరిధిలో జాతీయ డెంగ్యూ దినోత్సవం (మే16) సందర్భంగా డాక్టర్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మూడు పద్ధతులను పాటించండి, డెంగ్యూను జయించండి, పరిశీలించండి,శుభ్రం చేయండి, మూతలు పెట్టండి అనే నినాదంతో ప్రజల్లో డెంగ్యూ నివారణపై అవగాహన కల్పించేందుకు ఈ ప్రచారం ప్రారంభించారు. ఈకార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షణ సిబ్బంది నీలకంఠ, జానకి, శిఖామణి ఆరోగ్య కార్యక్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## జిల్లా ఇన్చార్జ్ మంత్రికి సదుంలో ఘన స్వాగతం



**సదుం, మే 16 ప్రభాతవార్త :** చిత్తూరు జిల్లా పర్యటనకు విచ్చేసిన జిల్లా ఇన్చార్జి మంత్రి, రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డికి సదుంలో శుక్రవారం ఘన స్వాగతం లభించింది. ఆయన రావడంతో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడురెడ్డి ప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మండలంలో ఏదైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలుగుదేశం పార్టీ నాయకులకు కూటమి నాయకులకు హామీ ఇచ్చారు. నాయకులు తెలుగుదేశం పార్టీ పుంగనూరు నియోజకవర్గ ఇన్చార్జి చల్లాబాబు, పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి వ్యవసాయ రైతులకు సత్కారం



**రామకుప్పం, మే 16 ప్రభాతవార్త:** మండలంలోని మిట్టపల్లి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులను ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకృతి వ్యవసాయంకు అందిస్తున్న ప్రోత్సాహన్ని, పంట దిగుబడులను వివరించారు. కషాయాలతో పంటలకు పిచికారీ చేయవచ్చన్నారు. కూరగాయల సాగుతో కలిగే లాభాలు వివరించారు. కార్యక్రమంలో నేతలు ఆంజనేయరెడ్డి, విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాసులు, సుబ్బన్న, సిబ్బంది జయప్ప పాల్గొన్నారు.

## గంగమ్మ సేవలో మంత్రి, కలెక్టర్



**బోయకొండ(చౌడేపల్లి), మే 16 ప్రభాతవార్త:** శక్తిస్వరూపిణీ బోయకొండ గంగమ్మను రాష్ట్రమంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్‌లు దర్శించుకొన్నారు. వారిని పుంగనూరు తేదేపా ఇన్ ఛార్జీ చల్లా రామ చంద్రారెడ్డి, మండల తేదేపా అధ్య క్షుడు గువ్వల రమేష్‌రెడ్డి, ఇఓ, ఉపకమీషనర్ ఏకాం బరంలు పూర్ణకుంభంతో స్వాగతం పలికి అమ్మవారి దర్శనభాగ్యం కల్పించారు. అనంతరం మండపంలో వేదాశీర్వాదం పవిత్ర తీర్థ ప్రసాదాలు, అమ్మవారి మెమొంటోతో సత్కరించారు. శ్రీధర్‌రాజు(గిరి), అనిల్‌కేశ్యామరాజు, నారాయణరాజు, లక్ష్మణరాజు(పతిరాజు), బోయకొండ సుబ్బు, సోము, రెడ్డి, తేదేపా నాయకులు, కార్యకర్తలు, బోయకొండ ఆలయ అధికార, సిబ్బంది, పాల్గొన్నారు.

## వైకాపా నేత సంపంగి మృతి



**శ్రీరంగరాజపురం, మే 16 ప్రభాతవార్త:** మండల పరిధిలోని 49 కొత్తపల్లిమిట్టకు చెందిన వైకాపా నాయకుడు సంపంగి (55) అనారోగ్యంతో మృతి చెందాడు. సంపంగి మృతదేహాన్ని సందర్శించి మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి, చిత్తూరు వైకాపా నియోజకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డిలు పూల మాలలు వేసి శుక్రవారం నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యుటీ సిఎం నారాయణస్వామి, చిత్తూరు వైకాపా నియో జకవర్గ ఇన్‌ఛార్జీ ఎంసి విజయానందరెడ్డిలు సంపంగి కుమారులు మాధవ, వారి కుటుంబసభ్యులను ఓదార్చి వారిలో ధైర్యం నింపారు. సంపంగి మృతదేహానికి నివాళులు అర్పించిన వారిలో సర్పంచ్ డివి ఢిల్లయ్య, జిల్లా వైకాపా ఉపాధ్యక్షులు గురువారెడ్డి, నాయకులు విజయబాబు, కుప్పయ్య, జనార్థన్, యేసురత్నం, స్కైలారెడ్డి, గోవిందరెడ్డి, కోటిరెడ్డి, బాబు, రిటైర్డ్ టీచర్ దొరస్వామి, హరిరెడ్డి, భాస్కర్ తదితరులు వున్నారు.

# చిత్తూరు డివిజన్

**చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం**

## ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా బొజ్జిరెడ్డి



**పుంగనూరు రూరల్, మే 16 ప్రభాతవార్త :** బీజేపీ అధిష్టానం చోళ్ల బొజ్జిరెడ్డిని ఎస్టీ కమిషన్ ఛైర్మన్‌గా ఎంపిక చేయడం పట్ల బీజేపీ రాష్ట్ర మైనారిటీ నాయకులు అయూబ్ ఖాన్ హర్షం వ్యక్తం చేశారు. అయూబ్ ఖాన్ మాట్లాడుతూ గిరిజన ప్రాంతాల్లో ప్రజలు గిరిజన హక్కుల కోసం వినియోగించుకోవాలి అని రాజ్యాంగ బద్ధమైన ఉన్నత స్థానం బీజేపీ సీనియర్ కార్యకర్త చోళ్ల బొజ్జి రెడ్డికి బీజేపీ గుర్తింపునివ్వడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఇది బిజెపి పార్టీలోని సాధ్యమని అన్నారు. సీనియర్ కార్యకర్తలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఆధ్వర్యంలో మంచి గుర్తింపునుబిజెపిరాష్ట్ర అధిష్టానం సూచనలు మేరకు బీజేపీ టీడీపీ కూటమీ రావడం శుభసూచకమన్నారు.

## పిల్లల ఆరోగ్యంపై కేర్‌అండ్‌గ్రో చొరవ ప్రశంసనీయం

**– ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్**

**– 19మందికి ఫీల్డ్ కోఆర్డినేటర్ల నియామక పత్రాలు అందజేత**



**కుప్పం, మే 16 ప్రభాతవార్త :** పిల్లల ఆరోగ్యంపై కేర్ అండ్‌గ్రో సంస్థ చూపు తున్న చొరవ ప్రశంసనీయమని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక మండల కార్యాలయంలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పని చేసేందుకు గాను ఎంపికైన 19 మందికి కేర్ అండ్‌గ్రో సంస్థ, కడ ద్వారా ఫీల్డ్ కోఆర్డినేటర్లుగా నియామకపత్రాలు అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి చిన్నారి అభివృద్ధిలో ఎంపికైన మహిళలు భాగస్వాములు కావాలని తమ విధులను మహోన్నత బాధ్యతతో నిర్వహించాలని సూచించారు. ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతంలో చిన్న పిల్లల ఆరోగ్యం పట్ల అంకిత భావంతో పనిచేయాలన్నారు. కడ పి.డి. వికాస్ మర్మత్ మాట్లాడుతూ ఈనెల 19వతేది నుంచి కుప్పం నియోజకవర్గంలో కేర్‌అండ్‌గ్రో సంస్థ ద్వారా కార్యకలాపాలు ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో కడ పి.డి. వికాస్ మర్మత్, రాష్ట్ర నేత బిఆర్ సురేష్‌బాబు, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మండల టిడిపి అధ్యక్షులు ప్రేమ్‌కుమార్, విశ్వనాథనాయుడు, గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, కడ సలహామండలి సభ్యుడు రామచంద్ర, నేతలు సత్యేంద్రశేఖర్, సతీష్, జనసేన నరేష్ పాల్గొన్నారు.

## శ్రీతిరుపతి గంగమ్మకు కంచర్లచే పట్టువస్త్రాలు



**కుప్పం, మే 16 ప్రభాతవార్త :** జిల్లాలో ప్రసిద్ధి చెందిన కుప్పం శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా అమ్మవారికి ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్ పట్టు వస్త్రాలను సమర్పించారు. ఈసందర్భంగా ఆలయ ప్రాంగ ణం దాకా పట్టు వస్త్రాలను ర్యాలీగా తీసుకువచ్చిన అనంతరం అమ్మవారికి ఆలయంలో సమర్పించారు. అనంతరం ఆలయంలో మహిళలకు పసుపుకుంకుమ, వస్త్రాలను పంపిణీఈ చేశారు. కార్యక్రమంలో ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, గంగమ్మగుడి ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, స్థానిక నేతలు, ఆలయకమిటీసభ్యులు, మహిళానేతలుఅనసూయ, సుగుణమ్మ, చంద్రకళ, శారదమ్మ, వసంతమ్మ పాల్గొన్నారు.

## శ్రీ తిరుపతి గంగమ్మ ఆలయంచే భారీ ఎత్తున అన్నదానం



**కుప్పం, మే 16 ప్రభాతవార్త :** కుప్పం గ్రామదేవత శ్రీ తిరుపతి గంగమ్మ జాతర సందర్భంగా ఆలయం తరపున శుక్రవారం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో శ్రీ అన్నపూర్ణదేవికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సిఎం చంద్రబాబునాయుడు తరపున భక్తులకు అందించే అన్నదాన కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పి.డి. వికాస్ మర్మత్ తదితరులు ప్రారంభించారు. సాయంత్రం దాకా అమ్మవారి ఆలయం ఎదుట అన్నదాన కార్యక్రమం కొనసాగగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో రాష్ట్ర నేతలు బిఆర్ సురేష్‌బాబు, గోపీనాథ్, ఆలయ కమిటీ ఛైర్మన్ బిఎంకె రవిచంద్ర, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, టిటిడి బోర్డు సభ్యుడు వైద్యం శాంతారాం, ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా డిఎస్పీ పార్థసారథి ఆదేశాలతో అర్బన్ సిఐ శంకరయ్య ఏర్పాట్లు పర్యవేక్షించారు.

## మంత్రి నిమ్మలచే పాలారు నది పరిశీలన



**శాంతిపురం, మే 16 ప్రభాతవార్త:** రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు శుక్రవారం సాయంత్రం స్థానికంగా ఉన్న పాలారు నదిని పరిశీలించారు. పాలారు నది గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే హంద్రీ-నీవా కాలువల ద్వారా నీళ్లు ఎక్కడ కలిశాయని అడిగి తెలుసుకున్నారు. ఏమేర పైపులైన్లు ఉన్నాయని వాకబు చేశారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ విప్ కంచర్ల శ్రీకాంత్, ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, కడ పిడి వికాస్ మర్మత్, ఆర్డీఓ శ్రీనివాసులురాజు, రాష్ట్ర నేత బిఆర్ సురేష్‌బాబు, నేతలు విశ్వనాథనాయుడు, జనార్ధనరెడ్డి, ఉదయ్‌కుమార్, ఎల్.జయరాంరెడ్డి, రాజు, రమేష్, గోపాల్, విజయకుమార్, తహశీల్దార్ శివయ్య పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన గంగమ్మ జాతర



**పలమనేరు, మే 16 ప్రభాతవార్త:** పలమనేరులో తిరుపతి గంగమ్మ జాతర వేడుకలు శుక్రవారం జలదితో ముగిసింది. ఈ నెల 14 రాత్రి అమ్మవారి శిరస్సు ఊరేగింపుతో ఆలయానికి అమ్మవారు చేరుకోగా ఈనెల 15న అమ్మవారి దర్శనం నిర్వహించారు. శుక్రవారం ఉదయం అమ్మవారి జలది ఉత్సవంలో భాగంగా ఆలయం వద్ద నుండి పట్టణంలోని గాంధీనగర్ వద్ద ఏర్పాటు చేసిన బావిలో జలది కార్యక్రమానికి భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఆలయం నుండి బజారు వీధి మీదుగా వేలాది మంది భక్తుల సమఖ్యంలో అమ్మవారిని జలదికి తరలించారు. ఈ కార్యక్రమంలో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటి ఛైర్మన్ శ్రీధర్, నిర్వహకులు, భక్తులు పాల్గొన్నారు.

---

## ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు ఆహ్వానం

**–సెక్యూరిటీ ఆర్డ్స్, సూపర్‌వైజర్స్, డేటా ఎంట్రీ, డ్రైవర్ ఉద్యోగాలు**

**తిరుపతిరూరల్, మే16 ప్రభాతవార్త:** ప్రభుత్వ, ప్రవేట్ రంగ సంస్థలలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన సెక్యూరిటీ గార్డ్స్, సెక్యూరిటీ సూపర్‌వైజర్స్, డేటా ఎంట్రీ ఆఫరేటర్స్, డ్రైవర్స్ కొరకు ధరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మహర్షి అభ్యుదయ సేవా సమితి అధ్యక్షుడు కె.జ్ఞానశేఖర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన అభ్యర్థులు ఈనెల 19 లోపల బైరాగిపట్టేడలోని మాస్ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు. ఇతర వివరాలకు 9392275861 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

## కూపుచంద్రపేటలో దర్జాగా గ్రామ కంఠం ఆక్రమణ

**–ఆలయానికి చెందిన భూమిని అన్యాక్రాంతమైతుందని ఆందోళన**



**తిరుపతిరూరల్, మే16 ప్రభాతవార్త:** తిరుపతిరూరల్ మండలం కూపుచంద్ర పేటలో గ్రామ కంఠం భూమిని టిడిపికి చెందిన ఓ మహిళ దౌర్జన్యంగా ఆక్రమించి, ప్రహరీ గోడ నిర్మిస్తుంది. ఆ స్థలంలో స్థానికులు వినాయక ఆలయం నిర్మించాలని తీర్మానం చేసుకున్నారు. కానీ ఈలోపలే ఆ భూమిని ఆక్రమించి ప్రహరీ గోడను ఏర్పాటు చేసి అన్యాక్రాంతం చేసారు. కె.సి.పేట గ్రామ రెవెన్యూ లెక్కదాఖల సర్వేనెంబర్ 260లో సుమారు రూ.30లక్షలు విలువైన గ్రామ కంఠం భూమిని అదే గ్రామానికి చెందిన ఓ మహిళ కబ్జా చేసి ఏకంగా ప్రహరీ నిర్మాణం చేయడంతో గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి గ్రామ కంఠ భూమిని పరిరక్షించాలని కోరుతున్నారు.

## ఆత్మ విశ్వాసంతోనే లక్ష్యసాధన.



**తిరుపతి విద్య, మే 16 ప్రభాత వార్త :** విద్యార్థులు ఆత్మ విశ్వాసంతో ముందడుగు వేస్తే లక్ష్య సాధన చిన్నదవుతుందని రిమ్స్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జే ప్రకాష్ రెడ్డి అభిప్రాయపడ్డారు. శుక్రవారం కళాశాలలో పీజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జూనియర్స్ వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉన్నత విద్యను అభ్యసించి ఉన్నత లక్ష్యంవైపు విద్యార్థులు దృష్టి సారించాలని సూచించారు. జీవితంలో ప్రతి అడుగు గుణపాఠంగా భావించి తప్పొప్పులను సరిచేసుకుంటూ లక్ష్యం వైపు సాగాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఛైర్మన్ వై కొండారెడ్డి, ఆనంద్ రెడ్డి, విజయ్ రెడ్డి, విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## చంద్రగిరి అభివృద్ధి లక్ష్యంగా పులివర్తి పరుగులు

**కలెక్టర్‌తో కలసి నియోజకవర్గ స్థాయి సమీక్ష పెండింగ్ నిర్మాణాలపై పరిశీలన**



**చంద్రగిరి, మే 16 ప్రభాతవార్త:** చారిత్రాత్మక చంద్రగిరి నియోజవర్గంలో అభివృద్ధే లక్ష్యంగా ఎంఎల్ఏ పులివర్తి నాని అధికారులను పరుగులు పెట్టిస్తున్నారు. స్థానిక విజయనగర్ కాలనీ వద్ద శుక్రవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్, ఆర్డీఓ రామ్మోహన్‌తో కలసి నియోజకవర్గంలోని 6 మండలాలకు చెందిన అన్ని ప్రభుత్వ విభాగాల అధికారులతో ఎంఎల్ఏ అభివృద్ధిపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో రైతుల సమస్యలపై అధికారుల పనితీరును కలెక్టర్‌కు వివరించారు. ముఖ్యంగా రైతులకు ప్రభుత్వం నుండి లభించే కార్యక్రమాలను ముందుగా రైతులకు చేరవేయడంలో అధికారులు విఫలమవుతున్నట్లు తెలిపారు. అదేవిధంగా నియోజకవర్గంలోని దామలచెరువు, ఏ.రంగంపేట, ముంగిలిపట్టు వద్ద మార్గాలలో తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నందున అధనంగా 108 వాహనాలను ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా గతంలో వరదలకు కొట్టుకుపోయిన వంతెనల నిర్మాణాలకు అవసరమైన సహకారానికి కోరారు. ఇంటి స్థలాల కొరకు ప్రజలు ఎదురు చూస్తున్నారని మంజూరు చేయాలని కోరారు. చంద్రగిరిలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టేందుకు ఆర్‌అండ్‌బి సహకారాన్ని కోరారు. చంద్రగిరి నియోజకవర్గ అభివృద్ధిపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పలు సూచనలు చేసినట్లు ఆయనకు వివరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే అధికారులను సస్పెండ్ చేయడం జరుగుతుందని, ఇకనైనా పద్దతి మార్చుకోవాలని అన్నారు. అంతకుముందు మహాప్రస్థానంలో జరుగుతున్న పనులను, ఎంపిడిఓ కార్యాలయ భవన నిర్మాణ పనులను పరిశీలించారు. అదేవిధంగా రెవెన్యూ కార్యాలయ ఆవరణలో నూతన రెవెన్యూ భవన నిర్మాణం ఆగిపోవడంపై కాంట్రాక్టర్ బొబ్బు చెంగారెడ్డిని ఆరాతీశారు. ఆధ్యంతం కార్యక్రమంలో చర్చించిన అంశాలను ఎంఎల్ఏతో సహ కలెక్టర్ నమోదు చేసుకున్నారు. కలెక్టర్ పలు అంశాలపై సానుకూలంగా స్పందించారు.

## ఆగివున్న లారీ ఢీకొని యువకుడు మృతి



**చంద్రగిరి, మే 16 ప్రభాతవార్త:** చంద్రగిరి సమీప బైపాస్ వద్ద ఓ డాబాలో భోజనం కోసం వెళుతూ డ్రైవర్ లారీని ఆపివుంచగా, ద్విచక్ర వాహనదారుడు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన ఘటన శుక్రవారం చోటుచేసుకున్నది. మృతుడు తమిళనాడుకు చెందిన ప్రసన్నగా గుర్తించారు. పోలీసులు మరింత సమాచారం కోసం విచారణ జరుపుతున్నారు. కాగా యువకుడు మృతి చెందడంతో లారీ డ్రైవర్ లారీ తీసుకుని పరారయ్యాడు.

## దోమకాటుతో డెంగ్యూ... తస్మాత్ జాగ్రత్త



**చంద్రగిరి, మే 16 ప్రభాతవార్త:** పగటిపూట కుట్టే ఏడీస్ ఈజిప్ట్ అనే దోమకాటు వలన డెంగ్యూ జ్వరం వస్తుందని తస్మాత్ జాగ్రత్త అంటూ గ్రామీణ ఆరోగ్య శిక్షణా కేంద్రం డాక్టర్ ఐ.యుగంధర్ అన్నారు. జాతీయ డెంగ్యూ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైద్య సిబ్బందికి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డెంగ్యూ జ్వరాలు రెండు రకాలు వున్నట్లు తెలిపారు. టైప్ 1 వచ్చినప్పుడు అధిక జ్వరం రావడం, తలనొప్పి, వాంతులు, శరీరంపై దద్దుర్లు వంటి వస్తాయని అన్నారు. అదేవిధంగా టైప్ 2 వచ్చినప్పుడు జ్వర ం, విపరీతమైన తలనొప్పి, ఒళ్ళునొప్పులు, వాంతులు, కడుపునొప్పి, తీవ్రత ఆధారంగా రక్తస్రావం, కోమాలోకి వెళ్ళడం జరుగుతుందన్నారు. ఇటువంటి దుస్థితి నేపథ్యంలో ప్రతి ఒక్కరూ జ్వరం రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. మీ ఇంటి పరిసరాలలో నిరుపయోగమైన వస్తువులు వున్నట్లయితే వాటిని తొలగించి, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలనీ, పారిశుధ్య నిర్మూలనకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రేవతి, డాక్టర్ సౌమ్యప్రియ, జూనియర్ డాక్టర్స్ మునిలక్ష్మి, వెంకుశ, నిత్య, లిఖిత, శ్వేత, హెల్త్ ఎడ్యుకేటర్ టాటాబాయి, సూపర్‌వైజర్లు ఎం.ప్రమీల, ఎన్.నాగరాజు, ఏఎన్ఎంలు సుబ్బలక్ష్మి, శశిరేఖ, తదితరులు పాల్గొన్నారు.

## జీతాలకోసం రోడ్డెక్కిన కార్మికులు

**తిరుమల, మే 16ప్రభాతవార్తప్రతినిధి:**



రెండు నెలలుగా చేసిన పనికి జీతాలు ఇవ్వకపోవడంతో పిఎన్ఎస్ ప్రైవేట్ లిమిటెడ్ కార్మికులు రోడ్డెక్కారు. శుక్రవారం ఉదయం నుండి సాయంత్రం వరకు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. తిరుమలలో అతిదిగృహాలు, విశ్రాంతి భవనాలలో పనిచేసే మహిళ కార్మికులకు ఏజెన్సీ సంస్థ పనులుచేయించుకుని రెండునెలలుగా జీతాలు ఇవ్వలేదు. తమ కుటుంబాలు గడవడం కష్టంగా ఉందని, టిటిడి డబ్బులుఇచ్చినా కాంట్రాక్టర్ జీతాలు ఇవ్వలేదని ఆవేదన చెందారు. తమ జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిరసనకు దిగారు.

# ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలోకి చేరికలు



వాకాడు, మే 16 ప్రభాతవార్త : మండల కేంద్రమైన వాకాడు షాది మంజిల్‌లో శుక్రవారం శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ చేతుల మీదుగా మాజీ టిడిపి మండల కన్వీనర్, ప్రస్తుత వైఎస్ఆర్సిపి వ్యవసాయ సలహా మండలి అధ్యక్షులు దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా మండలంలోని రావిగుంటు పాలెం పంచాయితీ, నిడిగుర్తి పంచాయతీ, మూల పడవ పంచాయతీ గ్రామాల నుండి అజిత్ కుమార్‌రెడ్డి అనుచరులు సుమారు 300మంది పైగా నాయకులు కార్యకర్తలు ఎమ్మెల్యే చేతులు మీదుగా పార్టీ కండువా కప్పుకున్నారు. అదేవిధంగా వాకాడు, నెల్లిపూడి, కొండాపురం పంచాయతీ నుండి సుమారు 200 మంది పైగా కార్యకర్తలు నాయకులు టిడిపి పార్టీలు చేరారు. ఈ సందర్భంగా సునీల్ కుమార్ మాట్లాడుతూ కొత్తగా వచ్చిన వారందరినీ కలుపు కోవాలని పాత నాయకులకు ఎమ్మెల్యే సూచించారు, మీరందరూ కలిసి రానున్న స్థానిక సంస్థ ఎన్నికలో 19 పంచాయతీలు సర్పంచులను, 11 ఎంపీటీసీ సెగ్మెంట్లను, జడ్పిటిసులను గెలిపించుకోవాల్సిన బాధ్యత నాయకులందరి మీద ఉందని ఎమ్మెల్యే తెలిపారు. కలిసి పని చేసి గూడూరు నియోజకవర్గంలోని టిడిపి పార్టీని ప్రథమ స్థానంలో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ మధురెడ్డి, మాజీ ఏఎంసి చైర్మన్ మనోజ్ కుమార్ రెడ్డి, విజయ శేఖర్ రెడ్డి, సన్నారెడ్డి ప్రసాద్‌రెడ్డి, పాపారెడ్డి పురుషోత్తం రెడ్డి, కృష్ణమూర్తి, అన్నమేటి చంద్రయ్య, నెల్లూరు సుధాకర్‌రెడ్డి, బత్తిన ప్రమీల, హరీష్ నాయుడు, జనార్దన్‌రెడ్డి, దయాకర్, తీపలపూడి రమణయ్య, తదితరులు పాల్గొన్నారు.

## టిప్పర్, బైక్ ఢీ: విద్యార్థికి గాయాలు



కోట, మే 16 ప్రభాతవార్త: మండలం ఊనుగుంటపాలెం గ్రామం నుంచి విద్యానగర్ వైపు గ్రావెల్ రవాణా చేస్తున్న టిప్పర్ గురువారం రాత్రి విద్యానగర్ నుంచి ఊనుగుంటపాలెం గ్రామం వైపు బైక్‌లో వస్తున్న ఇంటర్మీడియట్ విద్యార్థి అరవింద్ తేజను ఢీకొంది. ఈ సంఘటనలో అరవింద్ తేజాకు తీవ్ర గాయాలయ్యాయి. ఆ మేరకు చికిత్స నిమిత్తం తిరుపతిలోని స్విమ్స్‌కు తరలించారు. ఈ నేపథ్యంలో శుక్రవారం ఊనుగుంటపాలెం గ్రామస్థులు ఆ రోడ్డుపై గ్రావెల్ రవాణా చేస్తున్న టిప్పర్లను అడ్డుకున్నారు. బాధితుడికి న్యాయం చేయాలని కోరారు. అయితే ఈ విషయంపై ఎస్ఐ పవన్‌కుమార్‌ను వివరణ కోరగా, తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

## తెదేపాలో కార్యకర్తలే పార్టీకి పట్టుకొమ్మలు : ఎమ్మెల్యే



నాయుడుపేట, మే 16 ప్రభాతవార్త : సూళ్ళూరుపేట నియోజకవర్గంలో కార్యకర్తలే తెలుగుదేశంపార్టీకి పట్టు కొమ్మలాంటి వారని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. నాయుడుపేట పట్టణంలోని శ్రీనివాస పంక్షన్‌హాల్లో నిర్వహించిన పెళ్ళకూరు, ఓజిలి, నాయుడుపేట మండలాల కార్యకర్తల సమావేశానికి ఆమె ముఖ్యలతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే విజయశ్రీ మాట్లడుతూ తెలుగుదేశంపార్టీ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు ఆదేశాల మెరకు సూళ్ళూరుపేట నియోజకవర్గంలో ఆరు మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు అభిప్రాయాల మెరకు మండల పార్టీఅధ్యక్షులను ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. అందులో భాగంగానే శుక్రవారం నియోజకవర్గం లోని పెళ్ళకూరు, ఓజిలి, నాయుడుపేట మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను పంచాయతీల వారీగా తీసుకొని పార్టీ అధిష్టానానికి పంపడం జరుగుతుందని ఆమె తెలియజేశారు. ఈకార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి నెలవల సుబ్రమణ్యం,ఎన్నికల పరిశీలకుడు కొండలరావు, నాయుడుపేట, ఓజిలి,పెళ్ళకూరు మండలాల అధ్యక్షులు ఎస్ చంద్రారెడ్డి, విజయనాయుడు, సంచి కృష్ణయ్య,నాయుడుపేట మాజీజడ్పిటిసి పేరంశెట్టి శ్రీరామ్‌ప్రసాద్, తిరుపతిజిల్లా పార్టీఉపాధ్యక్షుడు వేలూరు మురళీకృష్ణరెడ్డి, చైతన్యకృష్ణరెడ్డితదితర నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## సచివాలయ ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

కోట, మే 16 ప్రభాతవార్త: మండలం కేశవరం సచివాలయంలో వెల్ఫేర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న అనిల్‌కుమార్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న మహేష్‌లు విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించినందుకు వారిద్దరికీ షోకాజ్ నోటీసులిచ్చినట్లు ఎంపిడిఓ దిలీప్‌కుమార్ తెలిపారు. విధి నిర్వహణలో వారిద్దరి నిర్లక్ష్యం కారణంగా ప్రజలకు సరైన సమయంలో సేవలు అందలేదని చెప్పారు.

**నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత:**

మండలంలో శనివారం పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు చెందోడు విద్యుత్ సబ్‌స్టేషన్ ఎడి చిన్నయ్య చెప్పారు. ఆయన శుక్రవారం మాట్లాడుతూ మండల పరిధిలోని విద్యానగర్, ఉత్తమనెల్లూరు, సిద్ధవరం, వంజివాక గ్రామాల్లో మెయింటెనెన్స్ పనుల కారణంగా సరఫరా నిలిపేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు అత్యవసర సర్వీసులకు ప్రత్యామ్నాయ మార్గాలు చూసుకోవాలన్నారు.

## మేడపై నుంచి కింద పడి విద్యార్థి దుర్మరణం



సూళ్ళూరుపేట, మే 16 ప్రభాతవార్త: సూళ్లూరుపేటలోని షార్ ఉద్యోగులు నివసించే పులికాట్ నగర్ కాలనీలో గురువారం ఇషార్త్ ఆలీ అనే 10వ తరగతి విద్యార్థి స్పేస్ సెంట్రల్ స్కూలు మేడపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి తీవ్రంగా గాయపడ్డాడు. ఆ విద్యార్థిని స్థానిక కెఆర్‌పి ఆసుపత్రిలో ప్రథమ చికిత్స అనంతరం చెన్నైలోని రామచంద్ర ఆసుపత్రికి మెరుగైన చికిత్స కోసం తరలించారు. అక్కడ ఇషార్త్ ఆలీ చికిత్స పొందుతూ మృతిచెందాడు. దీంతో పులికాట్ నగర్ కాలనీలో విషాదఛాయలు అలముకున్నాయి. సెలవు దినాల్లో విద్యార్థులకు తరగతులు నిర్వహిస్తుండటంతో ఆ తరగతులకు హాజరయ్యేందుకు వెళ్లిన ఇషార్త్ ఆలీ తోటి విద్యార్థులతో కలిసి ఆటలాడుతుండగా ఈ ప్రమాదం జరిగింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ప్రజా సమస్యలను పరిష్కరించడమే లక్ష్యం : ఎమ్మెల్యే



సూళ్లూరుపేట, మే 16 ప్రభాతవార్త : నియోజకవర్గం లోని సమస్యలను పరిష్కరించడమే లక్ష్యంగా పెట్టుకుని పనిచేస్తున్నట్లు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ తెలిపారు. శుక్రవారం క్యాంప్ కార్యాలయంలో ఆమె ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భ ంగా ప్రజల నుంచి పలు సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. రాష్ట్రప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాన్ని రూపొందించినట్లు ఆమె చెప్పారు. ఇందులో భాగంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు తనవంతు ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. వేసవిలో మంచినీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే వాటిని వీలైనంత వరకు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని విజయశ్రీ చెప్పారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, వేమసాని శ్రీనివాసులునాయుడు, అంచెల మధు, ఎజి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓ కార్యాలయాన్ని తనిఖీ చేసిన సిఇఓ



సూళ్లూరుపేట, మే 16 ప్రభాతవార్త : మండల ప్రజా పరిషత్ కార్యాలయాన్ని నెల్లూరు జిల్లా పరిషత్ సిఇఓ విద్యారమ శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె కార్యాలయంలోని రికార్డులను పరిశీలించి వాటిపై అధికారులకు సూచనలిచ్చారు. రికార్డు రూమ్‌లను, మండల పరిషత్ జరుగుతున్న అభివృద్ధి పనుల వివరాలను ఆమె ఎంపిడిఓ మురళీకృష్ణను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## మన్నారుగుడి ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్

సూళ్లూరుపేట, మే 16 ప్రభాతవార్త : సూళ్లూరుపేటలో మన్నారుగుడి, భగత్‌కాకోటి ఎక్స్‌ప్రెస్ రైలు స్టాపింగ్‌ను రైల్వే అధికారులు ఏర్పాటు చేశారు. గతంలో ఈ ఎక్స్‌ప్రెస్ రైలు వారంలో రెండురోజులు మాత్రం చెన్నై-భగత్‌కాకోటి మధ్య పయనించేది. ప్రస్తుతం ఈ ఎక్స్‌ప్రెస్ రైలును వారానికి ఐదురోజులు అందుబాటులో ఉండేలా రైల్వే అధికారులు నిర్ణయించారు. బుధ, శనివారాలు మినహా చెన్నై నుంచి ఈ రైలు బయలుదేరుతుంది. చెన్నైలో రాత్రి 7.45 గంటలకు బయలుదేరి సూళ్లూరపేటకు 9.08 గంటలకు చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో శని, మంగళవారాలు మినహా మిగతా రోజుల్లో సూళ్లూరుపేటకు రాత్రి 9.08 గంటలకు చేరుకుని చెన్నైకి రాత్రి 11 గంటలకు వెళుతుందని సూళ్లూరుపేట రైల్వే యూజర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కాళహస్తి సుబ్రహ్మణ్యం, శ్రీపతి రవీంద్రలు తెలిపారు. రైల్వే ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ రైలు స్టాపింగ్ వలన రాత్రి వేళల్లో నెల్లూరు వైపు వెళ్లేందుకు ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం కల్పించినట్లవుతుందని చెప్పారు.

## అప్రకటిత విద్యుత్ కోత అన్యాయం

సూళ్లూరుపేట, మే 16 ప్రభాతవార్త : పట్టణంలో విద్యుత్ శాఖ అధికారులు అప్రకటిత విద్యుత్ కోత అమలు చేయడం అన్యాయమని సూళ్లూరుపేట సిపిఎం కార్యదర్శి ఎస్‌కె రియాజ్ అన్నారు. విద్యుత్‌శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ఎప్పుడు పడితే అప్పుడు విద్యుత్‌కోత అమలు చేస్తున్నారని అన్నారు. ఈ విషయమై ప్రశ్నిస్తే అసలు సరైన సమాధానం చెప్పడం లేదని తెలిపారు. వేసవి కాలంలో విద్యుత్ కోత పట్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు.

## అన్నపూర్ణదేవి విగ్రహం తిరిగి ప్రతిష్టి



వెంకటగిరి, మే 16 ప్రభాతవార్త: బంగారుపేట వద్ద ఉన్న అనుకున్న దేవి అమ్మవారి విగ్రహాన్ని కొందరు తొలగించి కడున భూమిని ఆక్రమించారు. అయితే స్వామి వివేకానంద కమిటీ సభ్యులు శుక్రవారం తిరిగి అమ్మవారు విగ్రహాన్ని ప్రతిష్టించారు. అమ్మవారు విగ్రహాన్ని తొలగించి దూరంగా పడవేశారు. విగ్రహాన్ని తొలగించిన విషయాన్ని వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త రామ్ కుమార్‌రెడ్డి జిల్లా కలెక్టరుకు ఫిర్యాదు చేశారు.

## పాడి రైతులకు రాయితీతో పశువుల దాణా



బాలాయపల్లి, మే 16 ప్రభాతవార్త: పాడి పశువుల రైతులకు సగం ధరకే పశువుల దాణా ప్రభుత్వం ఇస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు రాయి మస్తాన్ నాయుడు తెలిపారు. స్థానిక వ్యవసాయశాఖ ప్రొడ్యూస్ స్టోరేజ్ భవనంలో రైతులకు పశువుల దాణా పంపిణీ చేశారు. పశువైద్యాధికారి సుధీర్ మాట్లాడుతూ మండలానికి పది టన్నుల దాన వచ్చినట్లు తెలిపారు. పాడి రైతులకు మూడు బస్తాలు ఇస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రస్ట్ బోర్డు సభ్యులకు సన్మానం



వెంకటగిరి, మే 16 ప్రభాతవార్త: పెంచలకోన లక్ష్మినరసింహస్వామి ఆలయం ట్రస్ట్ బోర్డ్ సభ్యులు తోట కృష్ణయ్యను తిరుపతి టౌన్ కాపు సంఘ నాయకులు, రిటైర్డ్ ఎక్సైజ్ ఎస్సైలు సిఐలు ఘనంగా సత్కరిం చారు. తోట కృష్ణయ్య శ్రీపెనుశేలలక్ష్మి నరసింహస్వామి వారి దేవస్థానం క్షేత్రం పెంచలకోన కార్యవర్గంలో పండుగ కమిటీలో సభ్యత్వం ఇచ్చినందుకు ఇంటి వద్దకు వచ్చి సన్మానం చేయడం జరిగినది.ఈ కార్యక్రమంలో కే సుబ్రహ్మణ్యం, డీకే సూర్య ప్రకాష్, పిగోవిందస్వామి, డాక్టర్ రమణ, హేమ,సాయిలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఘన స్వాగతం



వాకాడు, మే 16 ప్రభాతవార్త : అశోక పిల్లర్ సెంటర్ సమీపంలో గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్‌కు శుక్రవారం ఏఎంసి మాజీ చైర్మన్ పాపారెడ్డి మనోజ్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వాగతం పలికి ఎమ్మెల్యేను గజమాలతో ఘనంగా సత్కరించి, ఆహ్వానించారు. తిరంగా ర్యాలీ పలుచోట్ల బాణా సంచాలతో మార్మోగించారు, ఎమ్మెల్యేని స్వాగతం పలికిన వారిలో మండల టిడిపి కన్వీనర్ మధురెడ్డి, గూడూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పాపారెడ్డి పురుషోత్తమరెడ్డి, సీనియర్ టిడిపి నాయకుడు సన్నారెడ్డి విజయ శేఖర్ రెడ్డి, నాయకులు సన్నారెడ్డి ప్రసాద్ రెడ్డి, కృష్ణమూర్తి, ప్రసాద్ రెడ్డి, చరణ్‌రెడ్డి, అరుణ్ కుమార్, నెల్లూరు సుధాకర్ రెడ్డి, బత్తెన ప్రమీల, కోట, వాకాడు, చిట్టమూరు, గూడూరు నాయకులు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు డిగ్రీలతో పాటు నైపుణ్యాలు సాధించాలి

**ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్**



పుత్తూరు, మే 16 ప్రభాతవార్త : కేవలం డిగ్రీ అర్హతే కాకుండా విద్యార్థులు సాఫ్ట్ స్కిల్స్ వంటి ఇతర నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. చదువుకు, ఉద్యోగానికి సంబంధం లేదని, డిగ్రీ సర్టిఫికెట్లతోనే ఉద్యోగాలు రావని తెలిపారు. జాబ్ మేళాలో 25 వివిధ బహుళ జాతీయ సంస్థలు పాల్గొనగా 284 మంది విద్యార్థు లు ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. ఇందులో 161 మందికి ఉద్యోగాలు లభించాయి. కార్యక్రమంలో పద్మశాలి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ గంజి మాధవయ్య, కాలేజీ ప్రిన్సిపల్ బి.చంద్రమౌళి, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఎం.గుణశేఖర్‌రెడ్డి, ఐఎంబి డైరెక్టర్ అభిరామ్ నటరాజన్, మేనేజర్ శృతి, వైస్ ప్రిన్సిపల్ వీరయ్య, ఎస్‌పిఓసి టి.నరసింహులు, స్కిల్ డెవలప్‌మెంట్ జిల్లా ప్లేస్‌మెంట్ అధికారి చైతన్య, కాలేజీ స్కిల్ హబ్ సమన్వయకర్త ఎస్.రసూల్ పాల్గొన్నారు.

## మీలో ఒక్కడినంటూ తుడ చైర్మన్ ఆత్మీయ పలకరింపు



తిరుపతి,మే 16ప్రభాతవార్త: తుడ చైర్మన్‌గా నియమితులైన సి.దివాకర్‌రెడ్డి కూటమి పార్టీల్లోని నేతలందరినీ ఆప్యాయంగా కలసి ఆత్మీయపలకరింపుతో 'మీ అందరి వాడిగా..మీలో ఒక్కడిగా ఉంటా"నని తెలిపారు. మీ అందరి సహకారంతో పూర్తిస్థాయిలో తుడను అన్ని విధాలా అభివృద్ధి చేసుకుందామంటూ దివాకర్‌రెడ్డి శుక్రవారం ఉదయం తిరుపతిలోని పలువురు టిడిపి,జనసేన,బిజెపి నేతలను కలసి ఆత్మీయ పలకరింపుతో మర్యాదపూర్వకంగా మెలిగారు. 21వతేదీ తుడ చైర్మన్‌గా ప్రమాణస్వీకారం చేయనున్న దివాకర్‌రెడ్డి ఇప్పటికే సిఎం చంద్రబాబునాయుడును, మంత్రి నారాలోకేశ్‌ను కలిశారు. వారి సూచనలతో శుక్రవారం ఉదయం తిరుపతిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తినాని,టిడిపి నాయకులు సుగుణమ్మ, ఆర్‌సి మునికృష్ణ, నరసింహయాదవ్, జెబి శ్రీనివాస్‌ను, అన్నా రామచంద్రయ్యయాదవ్, అన్నా అనిత, బిజెపి నేత, టిటిడి బోర్డు సభ్యుడు భానుప్రకాశ్‌రెడ్డిని, ఆయనకుమారుడు పృధ్వీరెడ్డిని, జనసేననేత, హస్తకళల అభివృద్ధి కమిటీ చైర్మన్ డాక్టర్ హరిప్రసాద్‌ను కలిసి అందరితో మమేకమయ్యారు. తుడ అభివృద్ధికి సహకారం అందిస్తామని తెలిపారు.

## శివయ్యసేవలో ఇస్రో చైర్మెన్



శ్రీకాళహస్తి,మే 16 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో శుక్రవారం ఇస్రో చైర్మెన్ డాక్టర్ వి.నారాయణన్ కుటుంబసభ్యులతో వాయులింగేశ్వరుని దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో దక్షిణ గోపురం వద్ద ప్రొటోకాల్ ఎఇఓ సతీష్‌మాలిక్ వేదపండితులతో స్వాగతం పలికారు. స్వామిఅమ్మవార్ల అంతరాలయంలో పూజలు జరిపించుకున్న వారికి మృత్యుంజయస్వామి ఆలయం వద్ద వేదపండితులతో ఆశీర్వదించారు. ఎఇఓ సతీష్‌మాలిక్ స్వామి అమ్మవార్ల చిత్రపటాలను అందించారు.

## ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ ర్యాలీ



నాయుడుపేట,మే 16 ప్రభాతవార్త ; నాయుడుపేటలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ ఆధ్వర్యంలో కూటమి నాయకులు కార్యకర్తలు కలిసి ఆపరేషన్ సిందూర్ విజయోత్సవ తిరంగా ర్యాలీ నిర్వహించారు.పట్టణంలోని గాంధిమందిరం నుండి బజారుమీదుగా అంబేద్కర్ విగ్రహం వరకు తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లడుతూ దేశభద్రతలో భాగంగా భారత సైన్యం ఆక్రమిత కాశ్మీర్‌లో ఉగ్రవాద స్థావరాలను మట్టుపెట్టడం గర్వించదగ్గ విషయమన్నారు. ఆపరేషన్ సిందూర్‌లో అసువులు భాసిన వీరసైనికులకు సంతాపం తెలియజేశారు.ఈకార్యక్రమంలో మాజీఎంపి నెలవల సుబ్రమణ్యం, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉయ్యాల ప్రవీణ్,బిజెపి నాయకులు డాక్టర్ రంగినేని కృష్ణయ్య తదితర కూటమి నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రకృతి ఒడిలో మ్యాంగో రిసార్ట్స్: సినీ హీరో మంచు విష్ణు



చంద్రగిరి, మే 16 ప్రభాతవార్త: ప్రకృతి ఒడిలో పురుడుపోసుకున్న మ్యాంగో రిసార్ట్స్ అన్ని వర్గాల వారికి సంతృప్తికరమైన సేవలందిస్తుందని సినీ హీరో మంచు విష్ణు తెలిపారు. నరశింగాపురం సమీపంలో నూతనంగా నిర్మించిన మ్యాంగో రిసార్ట్స్ రెస్టారెంట్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతికి కేవలం 12 కిలోమీటర్ల దూరంలో ఆధునిక వసతులతో మామిడితోటలో నిర్మించబడిన రిసార్ట్స్ అందరికీ అనువైనదిగా అందుబాటులో వుందన్నారు. ఇందులో దూరప్రాంతాల వారితో పాటు నగరవాసులకు, నవవధూవరులకు, దంపతులకు, రిసార్ట్‌తో పాటు మ్యాంగో ట్రాన్క్విల్, మాంగో ఉడ్స్, మాంగో క్వాలిటీ సూట్, మాంగో బ్లిస్, మ్యాంగో హెవెన్, మ్యాంగో మిస్ట్, మ్యాంగో వయాసిస్ పేరిట సకల సౌకర్యాలతో గదులను నిర్మించినట్లు తెలిపారు. రిసార్ట్స్ సేవలను ఆస్వాదిం చాలని నగరవాసులకు, శ్రీవారి భక్తులకు సూచించారు. రిసార్ట్ ఎండి క్రిస్టఫర్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు పాల్గొన్నారు.



ఇస్రో చైర్మన్ డాక్టర్ వి.నారాయణ్ పిఎస్ఎల్‌వి-సి61 ఉపగ్రహం ప్రయోగం విజయవంతం కావాలని శ్రీ చెంగాళ్ళమ్మ పరమేశ్వరి అమ్మవారిని శుక్రవారం దర్శించుకొన్నారు. -ప్రభాతవార్త, తడ

# గూడూరు డివిజన్

## ఆర్టీసీ కార్మికుల డిమాండ్లను పరిష్కరించాలి

**-ఎస్‌డబ్ల్యూఎఫ్ రీజినల్ అధ్యక్షులు మల్లికార్జున**



వెంకటగిరి, మే 16 ప్రభాతవార్త: ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ డబ్ల్యూ ఎఫ్ రీజనల్ అధ్యక్షులు మల్లికార్జున తెలిపారు. ఈ ఎస్ ఎస్ డిగ్రీ కళాశాల వద్ద ఎస్ డబ్ల్యూ ఎఫ్ వెంకటగిరి డిపో 11వ మహాసభలు పెద్దయ్య అధ్యక్షతన జరిగాయి. మొదట డిపో సెక్రటరీ ఆర్ కృష్ణయ్య కార్యదర్శి నివేదిక ప్రవేశపెట్టారు. కార్యదర్శి నివేదికను మహాసభ ప్రతినిధు లందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ మహాసభల్లో ఎస్ డబ్ల్యూ ఎఫ్ తిరుపతి జిల్లా రీజనల్ అధ్యక్షులు మల్లికార్జున్ సిఐటియు నాయకులు శివాజీ సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు వడ్డిపల్లి చెంగయ్య సిఐటియు నాయకులు సిహెచ్ ఉదయభాస్కర్‌లు మాట్లాడుతూ వెంకటగిరి డిపోలో ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారం కోసం నూతనంగా ఏర్పడిన వెంకటగిరి డిపో స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ సిఐటియు కమిటీ కృషి చేయాలని అన్నారు. సిఐటియు నాయకులు ఎస్ డబ్ల్యూ ఎఫ్ నాయకులు అనేకమంది చర్చల్లో పాల్గొని ఉపన్యసించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. గౌరవ అధ్యక్షులు ఏవిరెడ్డి, అధ్యక్షులు పెద్దయ్య, ఉపాధ్యక్షులు ఎం బాలరాజు, కార్యదర్శి ఆర్.కృష్ణయ్య, జాయింట్ సెక్రటరీ ఎమ్మెస్ వాసులు, సిహెచ్ ఎస్ వాసులు, కోశాధికారి ఐఎస్ వాసులు, ప్రచార కార్యదర్శి ఎం విజయ్, కమిటీ మెంబర్లు ఎం కామాక్షమ్మ, ఏ.కస్తూరమ్మ, కె మహేష్, శివ తదితరులను మహాసభ ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు జి గోపాల్, వి.ఎస్.రావు తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ సింధూర్ విజయవంతం



వెంకటగిరి, మే 16, ప్రభాతవార్త: ఉగ్రవాదులను తుదిమట్టి చ్చేందుకు నిర్వహిం చిన ఆపరేషన్ సింధూరం విజయ వంతంగా జరిగినట్లు బిజెపి వెంకటగిరి నియోజకవర్గం ఇంచార్జ్ ఎస్ఎస్ఆర్‌నాయుడు తెలిపారు. వెంకటగిరిలోని బిజెపి కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ శాంతి కోసమే ఆపరేషన్ సింధూరం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఆపివేసినట్లు తెలిపారు. వెంకటగిరి పట్టణంలో ఈ నెల 17వ తేదీ శనివారం సాయంత్రం ఐదు గంటల నుండి తిరంగా ర్యాలీ కార్యక్రమంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బిజెపి పట్టణ అధ్యక్షులు పాలకృష్ణమూర్తి, చెంజితిరుపాల్రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

## భారత సైన్యంనకు సెల్యూట్ : ఎమ్మెల్యే



వాకాడు, మే 16 ప్రభాతవార్త: గత ఎన్నికల్లో మండలంలోని మెజార్టీని తగ్గించామని, మనోజ్ కుమార్‌రెడ్డి చేరికతో ఇంకా బలపడతామని గూడూరు శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం వాకాడులో జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమ ంనకు ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా విచ్చేసి ఈ సందర్భ ంగా స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పాకిస్తాన్ ఉగ్రవాదలను అంతం చేయడంపై భారత సైన్యంనకు సెల్యూట్ చేస్తున్నానన్నారు, మోడీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామని తెలిపారు. ముఖ్యంగా ఏపీలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టిడిపి జెండాను ఎగరవేస్తామన్నారు, మనోజ్ కుమార్ ండ్డి చేరికతో బలపడిపోయామని ఇప్పటినుంచి మండలం మీద దృష్టి పెట్టాలన్నారు,

## ఎమ్మెల్యే ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే

వాకాడు, మే 16 ప్రభాతవార్త: మండలం పరిషత్ కార్యాలయంలో శుక్రవారం గూడూరు ఎమ్మెల్యే డాక్టర్ పాశం సునీల్ కుమార్ ఆధ్వర్యంలో గ్రీవెన్స్ డే నిర్వహించడం జరిగినది. మండలంలోని వివిధ సమస్యలతో 115 అర్జీలు స్వీకరించడం జరిగినది. ప్రతి అర్జీని క్షుణ్ణంగా చదివి సంబంధించిన అధికారులతో మాట్లాడుతూ తక్షణమే అర్జీలు పై అధికారులు స్పందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీసిల్దార్ రామయ్య, ఎంపీడీవో శ్రీనివాసులు, ఆర్డబ్ల్యూస్ ఏ ఈ సుమాంజలి, పిఆర్ఏఈ కిరణ్, ఎంఈఓ నసీంఅలీ, వివిధ శాఖ అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## నవ శిశువులకు క్యాప్ టవల్స్ పంపిణీ



గూడూరు, మే 16 ప్రభాతవార్త : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో దాత, రోటరీ అధ్యక్షుడు రోటేరియన్ బండి శ్రీధర్‌రెడ్డి దాతృత్వంతో గూడూరు ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ నందు అప్పుడే పుట్టిన నవశిశువులను కప్పేందుకు ఉపయోగపడే క్యాప్ టవల్స్ ఒకరికి రెండు చొప్పున 20మంది పిల్లలకు శుక్రవారం ప్రభుత్వ ఏరియా హాస్పిటల్ సూపరింటెంట్ డాక్టర్ షరేనా చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమానికి దాత, రోటరీ క్లబ్ అధ్యక్షులు బండి శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ రోటరీ ఇంటర్నేషనల్ చేసే అతిపెద్ద సేవ కార్యక్రమం ప్రపంచంలో పోలియో లేకుండా చేయటం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జాయింట్ సెక్రటరీ బొల్లు రాంప్రసాద్ రొటేరియన్లు పివికృష్ణయ్య, పి రవీంద్రరెడ్డి, రిటైర్డ్ తాళంకి సురేష్, రిటైర్డ్ పువ్వాడ వెంకటేశ్వరులు, బలరామ్ రెడ్డి హెడ్ నర్స్ గౌరీ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## శ్రీచెన్న కేశవ స్వామి చకస్నానం



గూడూరు, మే 16 ప్రభాతవార్త : కరణాల వీధిలో వెలసి ఉన్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ చెన్నకేశవ స్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం చక్రస్నానం వేద పండితులు శాస్త్రోప్తంగా స్వామి అమ్మ వార్లకు వసంతోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఉభయ దాతలగా తూపిలి రామారావు రాజేశ్వరి, శ్రీనివాసులు పద్మజ, మహేష్, హరి ప్రణీత, సాకేత్ రామనందన్, శివకుశాంక్, కుటుంబ సభ్యులు వ్యవహరించారు.

## మాజీ సీఎంను కలిసిన నేదురుమల్లి



వెంకటగిరి, మే 16 ప్రభాతవార్త : మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాస గృహంలో వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేశారు. వెంకటగిరి నియోజకవర్గ రాజకీయాలపై నేదురుమల్లితో జగన్ చర్చించారు.

## పేటలో బార్లును తలపిస్తున్న బెల్టుషాపులు

నాయుడుపేట మే 16 ప్రభాతవార్త ; నాయుడుపేట పట్టణం,మండలంలోని మేనకూరు, చలివేంద్ర, ద్వారకాపురం, చిలమత్తూరు, కాపులూరు,కూచివాడ,పూడేరు,పుదూరు,గొట్టిప్రోలు,తదితర గ్రామాల్లో బెల్టుషాపుల నిర్వహకులు బార్లను తలపించే విధంగా బెల్టు నిర్వహిస్తున్న సంబంధిత ప్రొబిషన్,ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదని గ్రామీణ మహిళలు ఆరోపిస్తున్నారు. నాయుడుపేటలో మద్యంషాపుల నిర్వహకులు ఆటోలతో గ్రామాలకు మద్యం సరఫరా చేస్తుంటే గ్రామాల్లో నిర్వహిస్తున్న బెల్టుషాపుల్లో 20 నుండి 30 రూపాయలకు వరకు అదనంగా వసూళ్ళు చేస్తున్నట్లు మందుబాబులు వాపోతున్నారు. నాయుడుపేట పట్టణం,మండలంలోని చలివేంద్ర,మేనకూరులో కూల్‌డ్రింగ్స్‌షాపుల్లో ఎక్కడ సూచిన విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు చేపడుతున్నారు. ఈవిషయమై తిరుపతి ఎక్సైజ్ సూపరిడెంటును ప్రభాతవార్త వివరణ కోరగా ఆయన మాట్లడుతూ గ్రామల్లో బెల్టునిర్వహించే వారిపై కేసులు నమోదుచేసి నియంత్రించే విధంగా స్థానిక అధికారులను ఆదేశించడం జరుగుతుందని ఆయన తెలియజేశారు.

## నలుగుతున్న కార్యకర్తల గోడు వినండి



సత్యవేడు, మే 16 ప్రభాతవార్త: సత్యవేడు నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే హేమలత మర్యాదపూర్వకంగా స్వర్ణాంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పిలుపు మేరకు శుక్రవారం సాయంత్రం విజయవాడ పార్టీ కార్యాలయంలో కలసినట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే హేమలత మాట్లాడుతూ సత్యవేడు నియోజకవర్గంలో సంబంధించిన రాజకీయపరిణామాలపై, కార్యకర్తలకు జరుగుతున్న అన్యాయాలు లేక ద్వారా తెలియజేసినట్లు తెలిపారు. సాను కూలంగా స్పందించిన ముఖ్యమంత్రి నియోజకవర్గంలో ఉన్న అన్ని రాజకీయ సమస్యలను 3,4 రోజుల్లో పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో వేణుదిరిగారు.

**సూళ్ళూరుపేట పురపాలక సంఘము**

8-2-1, పార్కు వీధి, సూళ్ళూరుపేట-524 121
mail.sullurpet.mplty@gmail.com- Phone: 7093900652

**ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెండరు నోటీసు**

Roc No.398/2024/E1 Date: 16.05.2025

సూళ్ళూరుపేట పురపాలక సంఘము నందు 15వ ఆర్థిక సంఘం నిధులతో 1 పనికి ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం క్రింద ఆన్ లైన్ టెండర్లు కోరబడుతున్నవి. టెండరుదారులు ఇ-మార్కెట్ ప్లేస్, అనగా www.apeprocurement.gov.in నుండి టెండరు షెడ్యూలును డౌన్ లోడ్ చేసుకోనవచ్చు మరియు తదుపరి వివరాలు పొందవచ్చును. టెండర్ల స్వీకరణకు మొదలు తేది **17-05-2025**, టెండర్లు వేయుటకు చివరి తేది **31-05-2025.**

మునిసిపల్ కమీషనరు
సూళ్ళూరుపేట పురపాలక సంఘము